ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శనివారం 14 జూన్ 2025

ఉష్ణోగ్రత (అంచనా)

14-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	36	26
తెనాలి	37	27
నరసరావుపేట	35	27
బాపట్ల	36	27
రెంటచింతల	36	26
చీరాల	36	28

నిర్లక్ష్యంగా ఉంటే ఉపేక్షించను

- అధికార యంత్రాంగంపై పెమ్మసాని సీరియస్
- కార్పొరేషన్ సీఎంవోని సెలవు పెట్టి వెళ్లాలని ఆదేశాలు
- శంకర్‌విలాస్ ఆర్వోబీకి అన్ని శాఖలు ప్రాధాన్యమివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పనులు పూర్తి చేయడంలో, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటున్న కొన్ని శాఖలకు చెందిన అధికారులపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయినా పని తీరు మార్చుకునేందుకు తగిన సమయం ఇచ్చామని.. ఇకపై నిర్ణీత సమయంలో లక్ష్యాలను పూర్తి చేయకపోతే ఎవ్వరిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ శంకరన్‌హాల్‌లో ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. శంకర్‌విలాస్ ఆర్వోబీ, గుంటూరులో పారిశుధ్యం తన ప్రాధాన్యాలని, వాటిల్లో నిర్లక్ష్యం తగదన్నారు. ఉద్యోగ విరమణకి రెండు నెలలు గడువు ఉందని, ఇప్పటి నుంచే పని చేయనంటే కుదరదని నగరపాలకసంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్ అమృతపై మంత్రి పెమ్మసాని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతం చివరి రోజు వరకు తీసుకుంటున్నందున ఆరోజు వరకు పని చేయాల్సిందేనని, చేతకాకపోతే లాంగ్‌లీవ్ పెట్టి వెళ్లిపోవాలని ఆదేశించారు. శంకర్‌విలాస్ ఆర్వోబీకి సంబంధించి విద్యుత్ స్తంభాలను మార్చే విషయంలో ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి చెప్పిన సమాధానంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. పోల్స్ స్థానంలో టవర్లు ఏర్పాటుకి రూ.4 కోట్ల అవుతుందని అంత మొత్తాన్ని తాము చెల్లించే పరిస్థితిలో లేమని రూ.కోటి వరకు అయితే ఇవ్వగలమని నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు చెప్పారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ కేవలం బ్రిడ్జి పోర్షన్‌లో మాత్రమే టవర్లు ప్రతిపాదించాలని, మిగతా ప్రదేశంలో సాధారణ పోల్స్ ఏర్పాటు చేసి రెండు రోజుల వ్యవధిలో ఎస్టిమేట్లను నగరపాలకసంస్థకు ఇవ్వాలని ఆదేశించారు. గత నెలలోనే పిల్లర్ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించగా ఇప్పటివరకు ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. రైల్వే శాఖ నుంచి సాధ్యమైనంత త్వరగా స్థలాన్ని స్వాధీనం చేయాలని ఆదేశించారు. కొన్ని డిజైన్లు ఇవ్వలేదని కాంట్రాక్టర్లు తెలియజేయగా ఆ సంస్థకి నోటీసు ఇచ్చి బ్లాక్‌లిస్టు చేస్తామని హెచ్చరించాలని ఆదేశించారు. వారం వ్యవధిలో ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టి పిల్లర్ల నిర్మాణం మొదలు పెట్టించాలన్నారు.

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వే కోసం డంపర్‌బిన్‌లు తొలగించి గ్రీన్ మ్యాట్‌లు కట్టడంతో పారిశుధ్యం క్షీణించిందన్నారు. ఏ వీధికి వెళ్లినా ప్రజలు పారిశుద్ధ్యం పైనే ప్రశ్నిస్తున్నారని చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ప్రతీ నెలా కార్మికుల నుంచి మామూళ్లు డిమాండ్ చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. ప్రతీ 350 ఇళ్లకు ఇద్దరు వర్కర్లను కేటాయించి నిత్యం గార్బేజీ కలెక్షన్ చేసేలా చూడాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై ఆధారాలతో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ భార్గవతేజ, డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో శ్రీనివాసరావు, నగరపాలకసంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్.. అన్వేషణ

- ఇందన నిక్షేపాల కోసం ఓఎన్జీసీ సర్వే
- పొనుగుపాడు కాల్వ ప్రాంతంలో పనులు
- ఒంగోలు నుంచి విజయవాడ వరకు 24 వేల బోర్లు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆయిల్ నిక్షేపాల కోసం చమురు, సహజ వాయువుల సంస్థ (ఓఎన్జీసీ) అన్వేషణ చేపట్టింది. ఇందనం, గ్యాస్ నిక్షేపాలను గుర్తించేందుకు విస్తృతంగా సర్వే పనులు జరుగుతున్నాయి. శాటిలైట్ నివేదికల ఆధారంగా ఆయిల్ నిక్షేపాల కోసం ఓఎన్జీసీ



ఫిరంగిపురం : పొనుగుపాడులో భూముల్లో ఆయిల్ సర్వే కోసం వేస్తున్న బోర్లు

అధికారులు అన్వేషిస్తున్నారు. చమురు, గ్యాస్ నిల్వల ఉనికి, పరిమాణాన్ని నిర్ధారించడానికి ముందుగా గుర్తించిన ప్రాంతాల్లో బోరు బావులను తవ్వుతున్నారు. ఒక్కొక్క బోరు 80 అడుగుల లోతున వేస్తున్నారు. ఒంగోలు నుంచి విజయవాడ కృష్ణానది వరకు సర్వే చేస్తున్నారు. ఇందులో భాగంగా కొన్ని రోజులుగా ఫిరంగిపురం మండలం పొనుగుపాడు కాల్వ ప్రాంతంలోని పొలాల్లో పెద్దఎత్తున బోర్లు వేస్తున్నారు. ఈ బోర్ల నుంచి సదరు సంస్థ ఇంజనీర్లు మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపుతున్నారు. ఇలా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో మొత్తం 24,000 బోర్లు వేయాలని నిర్ణయించినట్లు సమాచారం. ఇప్పటికే 14,000 బోర్ల నిర్మాణం జరిగింది. రానున్న రెండు నెలల్లో మిగిలిన 10,000 బోర్లు వేయనున్నారు. ఒక్కొక్కబోరుకు రూ.5,600 చెల్లిస్తున్నారు. కేవలం బోర్ల నిర్మాణానికే ఓ ఎన్జీసీ రూ.13.44 కోట్లు ఖర్చు చేస్తోంది. రైతుల ఆమోదంతోనే బోర్ల నిర్మాణం చేపట్టినట్లు సదరు సంస్థకు చెందిన కాంట్రాక్టర్లు తెలిపారు. పొనుగుపాడులో ఒకే ప్రాంతంలో పెద్దఎత్తున బోర్ల నిర్మాణం జరుగుతుండటంతో ఆ ప్రాంతాల రైతులు, ప్రజలు అక్కడ ఏమి చేస్తున్నారు.. ఎందుకు బోర్లు వేస్తున్నారనే విషయాలను పరిశీలించేందుకు, తెలుసుకునేందుకు ప్రత్యేకంగా ఆసక్తి చూపుతున్నారు.

తల్లికి వందనం ఆనందం

సూపర్ సిక్స్‌లోని.. 'తల్లికి వందనం' విద్యా సంవత్సరం ఆరంభం రోజునే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. శుక్రవారం ఉదయం నుంచి తల్లుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కావడం ప్రారంభమైంది. ఖాతాల్లో పడిన నగదు చూసు కుని తల్లిదండ్రుల్లో ఆనందం వెల్లివెరిసింది. గత వైసీపీ ప్రభు త్వం అమ్మఒడి పథకాన్ని అమలు చేసినా ఒక్కో కుటుంబంలో ఒక్కరికే అమలు చేసింది. కుటుం బంలో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం అమలు చేస్తామని చెప్పినట్లుగానే కూటమి ప్రభుత్వం ముగ్గురు, నలుగురు, ఐదుగురు పిల్లలు ఉన్న వారికి కూడా నగదు వేయడంతో ఆ కుటుంబాల్లో సంతోషాన్ని రెట్టింపు చేసింది. వైసీపీ నేతలు తల్లికి వందనం అమలుపై దుష్ప్రచారం చేయగా.. వాటిని పటాపంచలు చేస్తూ గతంలో చెప్పినట్లుగా పథకాన్ని అమలు చేయడంతో కూటమి శ్రేణులతో పాటు లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో తల్లిదండ్రులతో కలిసి కూటమి నేతలు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞత తెలిపారు. తల్లికి వందనం పేద కుటుంబాల్లో సంతోషాలను తీసుకొచ్చింది.



తల్లికి వందనం నగదు జమ చేయబడిన ముగ్గురు పిల్లలతో ఈమనికి చెందిన కంచర్ల రజిత

తల్లుల ఖాతాల్లో జమవుతున్న నగదు


- ఈపూరులో ఐదుగురున్న పిల్లల తల్లికి ఏకమొత్తంగా రూ.65 వేలు
- పిల్లలతో కలిసి హర్షం వ్యక్తం చేస్తోన్న తల్లిదండ్రులు
- సచివాలయాల వారీగా లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన
- అభ్యంతరాల స్వీకరణకు వచ్చే నెల 5 వరకు గడువు



పెదకూరపాడులో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

(గుంటూరు, గుంటూరు(విద్య), బాపట్ల - ఆంధ్రజ్యోతి)

ఎన్నికల హామీలో ప్రధానమైన తల్లికి వందనం పథకం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గురువారం జీవో విడు దల చేయగా ఆ తర్వాత నుంచి తల్లుల ఖా తాల్లో నగదు జమ అవడం ప్రారంభమైంది. శుక్రవారం ఉదయానికే గ్రామ/వార్డు సచివా లయాల్లో తల్లికి వందనం పథకానికి సం బంధించి అర్హులు, అనర్హుల జాబితాలను ప్రదర్శించారు. అలానే వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేశారు. వాటిని చూసుకుని అర్హుల జాబితాలో ఉన్న తల్లుల ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. కాసేపటికి (మిగతా 6వ పేజీలో)





ఆనందంగా స్కూలుకు వెళుతూ

8,199 మందికి ట్రిపుల్ ధమాక

తల్లికి వందనం పథకాన్ని కుటుంబంలోని పిల్లలందరికీ వర్తింప చేయడంపై అనుమానాలు వ్యక్తం చేసిన వారు కూడా ఆశ్చర్యపోయేలా తల్లుల ఖాతాల్లో ఏకమొత్తం గా నగదు జమ చేస్తున్నారు. ముగ్గురు పిల్లలు ఉన్న తల్లులకు ట్రిపు ల్ ధమాక లభించింది. గుంటూరు జిల్లాలో 2131, పల్నాడు జిల్లాలో 4635, బాపట్ల జిల్లాలో 1433 మంది తల్లులకు ముగ్గురు/అంతకంటే ఎక్కువమంది పిల్లలు ఉన్న తల్లులు 'తల్లికి వందనం' పథకానికి ఎంపికయ్యారు. వీరిలో పలువురికి నగదు జమ కూడా అయింది. ఒక్కో బిడ్డకు రూ.13 వేల చొప్పున ముగ్గురున్న వారికి రూ.39 వేలు, నలుగురు ఉన్న వారికి రూ.52 వేల నగదు బ్యాంకు ఖాతాల్లో జమైంది. పల్నాడు జిల్లా పరిధిలో ఈ పథకం ద్వారా పెద్దసంఖ్యలో తల్లులు లబ్ధి పొందినట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి.

ఐదింతలు..

ఈపూరు ఎస్సీ కాలనీకి చెందిన దారా సాగర్, మేరీ దంపతులకు ఐదుగురు సంతానం కాగా వారికి రూ.65 వేలు బ్యాంకు ఖాతాలో జమ కావడంతో వారి ఆనందం ఐదింతలైంది.

8 విత్తనాల విఫణిలో.. జిల్లాకు నకిలీ మరకలు
- భద్రాద్రి కొత్తగూడెంలో నకిలీ మిర్చి విత్తనాలు పట్టివేత
- మహబూబ్ నగర్‌లో దొరికిన బీటీ3 పత్తి విత్తనాలు
- రెండు తెలుగు రాష్ట్రాలకు గుంటూరు నుంచే సరఫరా
- నిద్రపోతున్న నిఘా వ్యవస్థ

22 అర్ధరాత్రి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె 6

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్ 6

ఏఎన్‌యూ పీజీ మూడో సెమిస్టర్ ఫలితాల విడుదల
- 20 వరకు పునఃమూల్యాంకనానికి అవకాశం

ఐకానిక్ టవర్ల నిర్మాణానికి.. పర్యావరణ అనుమతులకు సీఆర్డీఏ లేఖ
- ఎస్ఈఐఏఏకు నివేదిక పంపిన సీఆర్డీఏ
- 2018లో జారీ చేసిన టీఓఆర్‌తో సమగ్ర నివేదిక
- వైసీపీ కుట్రల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు
8

కొనసాగుతున్న కౌన్సెలింగ్

- మాన్యువల్‌గా నిర్వహించాలని మున్సిపల్ టీచర్ల డిమాండ్
- డీఈవో రేణుక హామీతో ఉపాధ్యాయుల ఆందోళన విరమణ
- నేటితో బదిలీ ప్రక్రియ ముగింపు.. 16న విధుల్లోకి ఉపాధ్యాయులు



సమావేశంలో కింద కూర్చుని ఆందోళన చేస్తున్న మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాల ఉపాధ్యాయులు

గుంటూరు(విద్య), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించి ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ శుక్రవారం జడ్పీ సమావేశ మందిరంలో జరిగింది. అర్ధరాత్రి వరకు కూడా కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఉపాధ్యాయులు జడ్పీ వద్ద రాత్రి పూట కూడా పడిగాపులు కాస్తున్నారు. మండల పరిషత్ యాజమాన్యాల ఆధ్వర్యంలోని పాఠశాలల్లో పని చేసే ఎస్జీటీలకు బదిలీల కౌన్సెలింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ చేపట్టారు. పలు అవాంతరాలతో ఆయా ఉపాధ్యాయులు తమకు కూడా మాన్యువల్‌గానే బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. జడ్పీ సమావేశ మందిరంలోని కౌన్సెలింగ్ కేంద్రం వద్ద మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ నాయకులు పెదబాబు, డీకే సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన ఒత్తిడి కారణంగా ఇప్పటికే 80 శాతం మంది మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్లు పెట్టుకున్నారని దీనివల్ల వారికి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఉపాధ్యాయుల ఆందోళనతో స్పందించిన డీఈవో రేణుక మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. దీంతో ఉపాధ్యాయులు ఆందోళన విరమించారు. శనివారం మున్సిపల్ ఉపాధ్యాయులకు కూడా కౌన్సెలింగ్ పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు ప్రకటించారు. సోమవారానికి ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధుల్లో చేరతారని విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

నల్లపాడులో ఫ్రైట్ డిపో ప్రారంభం

- శిలాఫలకం ఆవిష్కరించిన రైల్వే జీఎం

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నల్లపాడు రైల్వే ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన ఫ్రైట్ డిపోని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ ప్రారంభించారు. శుక్రవారం గుంటూరు రైల్వే డివిజన్ పర్యటనకు వచ్చిన ఆయన తొలుత నల్లపాడు రైల్వే స్టేషన్‌ని సందర్శించారు. అక్కడ ఫ్రైట్ డిపోకి శిలా ఫలకం ఆవిష్కరించారు. ఇక నుంచి ఈ ఫ్రైట్ డిపోలో గూడ్స్ వ్యాగన్లను పరీక్షించి బీపీసీ సర్టిఫికెట్లను జారీ చేస్తారు. అలానే పాడైపోయిన వ్యాగన్లకు మరమ్మతులు నిర్వహిస్తారు. అనంతరం ఫ్రైట్ డిపో ఆవరణలో జీఎం మొక్కలు నాటారు. ఆ తర్వాత ఫైట్ డిటెక్షన్, అలర్ట్ సిస్టమ్‌లను జీఎం ప్రారంభించారు. రైల్వే హాస్పిటల్, ట్రాక్షన్ పవర్ కంట్రోల్ భవనాలను కూడా సందర్శించా రు. రైల్ వికాస్ భవన్‌లో గుంటూరు డివిజన్ పురోగతిపై సమీక్షించారు. డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణసేన్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జీఎంకు పురోగతిని వివరించారు. కార్యక్రమాల్లో ఏడీఆర్ఎం కే సైమన్, గతి శక్తి సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేషన్ జేవీ అనూష, సీనియర్ డీఎంఈ రవికిరణ్, సీని యర్ డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్, సీనియర్ డీవోఎం శ్రీనాథ్, సీనియర్ డీఎస్‌టీఈ రత్నాకర్, సీనియర్ డీఈఈ సూర్యనారా యణ్, సీనియర్ డీఈఈ రవితేజ, డీఎస్‌సీ మధుసూ దనరావు పాల్గొన్నారు.



డిపోని ప్రారంభిస్తున్న జీఎం అరుణ్‌కుమార్‌జైన్, డీఆర్ఎం సుధేష్ణసేన్

రేపు పునీత ఆంథోని పుణ్యక్షేత్ర వార్షికోత్సవం

- ముగ్గురు పీఠాధిపతులు.. 120 మంది గురువులు రాక

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అద్భుతాల అంతోని పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న నగరంపాలెంలోని దేవాలయ 35వ వార్షికోత్సవం ఆదివారం జరగనున్నది. మూడు రోజుల ఉత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం జరిగిన దివ్య బలి పూజకు ఫిరంగిపురం విచారణ సహాయక గురువులు ఫాదర్ ఎలెక్స్ పాల్గొని దైవ సందేశం ఇచ్చారు. పూజ అనంతరం ట్రాక్టర్‌పై పునీత అంతోని వారి స్వరూపాన్ని ఊరేగించారు. మొక్కులు చెల్లించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లపై విచారణ గురువు కొచ్చర్ల జ్యోతిరాజు శుక్రవారం విలేకర్లకు వివరాలు తెలిపారు. పునీత అంతోని ఆలయ మహోత్సవం ప్రతి ఏటా మూడు రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 1195 ఆగస్టు 15న జన్మించిన పునీత అంతోని 1231 జూన్ 13న మరణించగా అదే నెల 17న(మంగళవారం) సమాధి చేశారన్నారు. ఆ రోజు నుంచి అద్భుతాలు జరగడం ప్రారంభమైందన్నారు. అందుకే మంగళవారం అంతోని వారికి ఇష్టమైన రోజు అన్నారు. చనిపోయిన రోజుకు కూడా ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. కాగా ఈ ఏడాది 35వ వార్షికోత్సవం రావడంతో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15న సాయంత్రం 6 గంటలకు జరిగే దివ్యబలి పూజకు గుంటూరు బిషప్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య, నెల్లూరు బిషప్ డాక్టర్ పిల్లి అంతోనిదాస్, గుంటూరు విశ్రాంత పీఠాధిపతులు డాక్టర్ గాలిబాలి హాజరవుతారన్నారు. 120 మంది పైగా గురువులు, 200 మంది పైగా సిస్టర్స్ హాజరవుతారన్నారు. ఆయా పీఠాధిపతులను గుర్రపు రథాలపై ఊరేగిస్తామన్నారు. పూజ అనంతరం భక్తులకు విందు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో సహాయకులు ఫాదర్ నంది పాము రాజేష్, కౌన్సిల్ సభ్యులు నేలటూరి జ్ఞాన ప్రకాశరావు, జొన్నలగడ్డ సుధీర్‌బాబు, దేవయ్య, మేకల ప్రకాష్‌రావు, గుండెగ దేవయ్య, సంకూరి శాంతయ్య పాల్గొన్నారు.



గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఉమేష్, ఎస్ఐ ఆనంద్, సిబ్బంది

తెనాలి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసలై గంజాయి విక్రయాలు చేస్తున్న నలుగురు ముఠాను రూ రల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులు, పట్టుకున్న గంజాయితో కేసు వివరాలను సీఐ ఉమేష్ వెల్లడిం చారు. తెనాలి మండలం సోమసుందరపాలేనికి చెందిన అలికిపల్లి సాంబిరెడ్డి, ఆటోనగర్‌కు చెందిన కూరగంటి చైతన్య, పెదరావూరుకు చెందిన పగడం మణి సింహారెడ్డి, తెనాలి ఐతానగర్‌కు చెందిన సుకుమార్ స్నేహితులు. వ్యసనాలకు బానిసలైన నలుగురూ డబ్బు సంపాదించేందుకు గంజాయి విక్రయాలను ఎంచుకున్నారు. గుంటూరు కొత్తపేటకు చెందిన రత్తయ్య వద్ద నెలకోసారి గంజాయిని కొనుగోలు చేసి, తెనాలిలో చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి.. ప్యాకెట్ రూ. 500 వంతున విక్రయిస్తుంటారు. గురువారం రత్తయ్య వద్దకు నలుగురూ సాంబిరెడ్డి బైక్‌పై వెళ్లి కేజీ నాలుగు వందల గ్రాములు గంజాయిని రూ.12,000 కొనుగోలు చేశారు. సుకుమార్ గుంటూరులోనే ఆగిపోవడంతో మిగి లిన ముగ్గురూ గంజాయితో తెనాలికి బయలు దేరారు. నందివెలుగు కూడలిలో రూరల్ సీఐ ఉమేష్, ఎస్ఐలు ఆనంద్, శ్రీనివాసరావు సిబ్బందితో తనిఖీలు నిర్వ హిస్తుండగా నిందితులను పట్టుకుని వారి వద్ద ఉన్న గంజాయిని సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న సుకుమార్, గంజాయి విక్రయించిన రత్తయ్యను అదుపులోకి తీసుకోవాల్సి ఉందని సీఐ ఉమేష్ పేర్కొ న్నారు. హెడ్‌కానిస్టేబుల్ వి.చంగలరాయుడు, కానిస్టేబుల్ రవి, కఫూర్ నాయక్, ఇంకోల్లు రవికుమార్ పాల్గొన్నారు.

గుత్తేదారి కనపడలేదా!

● అధ్వానంగా రేపల్లె-నిజాంపట్నం రహదారి ● అభివృద్ధికి రూ.9 కోట్లతో టెండర్
● మూడు నెలల నుంచి పనుల నిలుపుదల ● పట్టించుకోని అధికారులు..వాహనదారుల అవస్థలు



శింగుపాలెం వద్ద రహదారి గుంతలో ఇక్కట్లు



నిజాంపట్నం గ్రామం వద్ద రహదారిలో నిలిచిన వర్షపు నీరు

రేపల్లె, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలోని రేపల్లె-నిజాం పట్నం రహదారి అభివృద్ధికి రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్ర సాద్ రూ.9 కోట్ల నిధులు మంజూరు చేశారు. రోడ్లు, భవనాలశాఖ అ ధికారులు టెండర్లు పిలవడంతో ఒంగోలుకు చెందిన కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నాడు. మూడు నెలలుగా రేపల్లె పట్టణం ఇసుక పల్లి నుంచి సజ్జావారిపాలెం వరకు రహదారిని తవ్వేసి బీటీ వేసి వది లేశారు. దీంతో కంకరరాళ్లు బయటకు తేలి వాహనదారులు ప్రమాదా లకు గురవుతున్నారు. వాహనాల రాకపోకల సమయంలో భారీగా దుమ్ము లేచి, వెనుకనుంచి వచ్చేవారికి రహదారి కనబడే పరిస్థితి లేకుండా ఉంది. సజ్జావారిపాలెం వద్ద సగం రహదారి తవ్వేసి వది లేయడం, ఒక వైపు భారీ గుంతగా ఉండటం వల్ల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోంది. రహదారి అంతా భారీస్థాయిలో గుంతలు ప డటంతో వర్షపు నీరు, గృహాల వ్యర్థపు నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. శింగుపాలెం, పల్లపట్ల, నిజాంపట్నం గ్రామాల్లో పదేసి మీటర్ల పైనే గుంతలు ఉన్నాయి. కనీసం మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకున్నా ఆర్అండ్‌బీ అధికా రులు అభివృద్ధిపై దృష్టిసారించిన దాఖలాలు లేవు. తక్షణమే ఉన్నతాధి కారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించి రహదారి అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని తీరప్రాంతవాసులు కోరుతున్నారు.

మా అప్పు కడితే చాలు.. పార్టీతో సంబంధం లేదు

● సాయి కార్తిక్ సిటీ సెంటర్ రుణదాతల డిమాండ్



మాట్లాడుతున్న సాయి కార్తిక్ సిటీ సెంటర్ రుణ దాతలు

చిలకలూరిపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తమ వద్ద తీసుకున్న రూ. 7.5 కోట్ల మొత్తాన్ని తక్షణం తిరిగి చెల్లించాలని శుక్రవారం బాధిత రుణ దాతలు శుక్రవారం సాయి కార్తిక్ సిటీ సెంటర్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పట్టణానికి చెందిన కొందరు మీడియా ప్రతినిధులను వెంటతీసుకుని వెళ్లి సిటీ సెంటర్ వద్ద నివాసముంటున్న సెంటర్ భాగస్తుడు రావి సుధాకర్‌ను కలిశారు. కొద్ది రోజుల క్రితం రావి సుధాకర్, భార్య, కుమారుడు రావి మురళి హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమ సాయి కార్తిక్ సిటీ సెంటర్ భవనాన్ని టీడీపీకి చెందిన వారు ఆక్రమించుకున్నారని ఆరోపించారు. తాము డబ్బు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ రుణ దాతలు వచ్చి తీసుకోవడం లేదని చెప్పారు. ఈ నేపథ్యంలో రుణ దాతలు ఎవరికి ఎంత అప్పులు ఉన్నారో తెలిపే పత్రాలను సుధాకర్‌కు చూపించారు. అయితే..ఈ బాకీలతో తనకు సంబంధం లేదని, తన కుమారుడు మురళీని అడగాలని సుధాకర్ సమాధానం ఇచ్చారు. అనంతరం బాధితులు కె.అంజిబాబు, తేలప్రోలు వీరయ్య చౌదరి, భీమినేని స్వాములు, సోమేపల్లి ప్రసాద్ తదితరులు మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ ప్రెస్ మీట్‌లో రావి సుధాకర్, మురళి తప్పుడు ఆరోపణలు చేశారన్నారు. వారి భవనాన్ని తాము ఆక్రమించుకుంటే రావి సుధాకర్ అందులో ఎందుకు ఉంటారని ప్రశ్నించారు. వారి ఆస్తులతో తమకు సంబంధం లేదని చెప్పారు. ఈ విషయంలో టీడీపీ కి ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తమ డబ్బు తమకు ఇస్తే సమస్య పరిష్కారమవుతుందని తేల్చి చెప్పారు.

22 అర్ధరాత్రి నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

గుంటూరు కార్పొరేషన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 22 నుండి మున్సిపల్ కార్మికులు సమ్మెకు దిగుతున్నట్లు ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్- టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇ.మధుబాబు తెలిపారు. శుక్రవారం ఈ మేరకు గుంటూరు నగరపాలక సంస్థ ఇంచార్జి అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావుని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నగరపాలక, పురపాలక సంఘాల్లోని నాన్ పీహెచ్ విభాగంలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులు జీతాలు పెంచాలని ప్రభుత్వానికి ఎన్నో వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. యూనియన్ ఆధ్వర్యంలో 38 రోజులుగా సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం లోని సీడీఎంఏ రెండుసార్లు చర్చలు జరిపి.. పురోగతి లేకుండానే ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పడం జరిగిందన్నారు. మున్సిపల్ శాఖ మంత్రితో చర్చలు జరిపినా.. ఇదే సమాధానం వచ్చిందని వెల్లడించారు. కార్మిక సంఘాలన్నీ ఐక్య కార్యాచరణ కమిటీగా ఏర్పడి ఈ నెల 9న వడ్డేశ్వరంలోని సీడీఎంఏ మురళీ కృష్ణకి సమ్మె నోటీసు ఇచ్చామని చెప్పారు. గుంటూరు నగరపాల సంస్థ కమిషనర్ అందుబాటులో లేకపోవడం వల్ల ఇన్‌చార్జి అడిషనల్ కమిషనర్ శ్రీనివాసరావుకి సమ్మె నోటీసు ఇచ్చామని చెప్పారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రాయపూడి కోటిబాబు, కార్యనిర్వహణ కార్యదర్శి గాలి ఏసుబాబు, కోశాధికారి నాగిపోగు సుమన్, కార్మికులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్ మరమ్మతులు చేపట్టాలి

● ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్



కాల్వను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

పెదకాకాని, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పశ్చిమ కృష్ణా డెల్టాలో ఉన్న ప్రధాన, పంట కాల్వల మరమ్మతులు వెంటనే చేపట్టి ఖరీఫ్ సీజన్‌లో నీటి పారుదలకు ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పెదకాకాని సమీపంలోని గుంటూరు చానల్‌ను రైతు సంఘం నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశ్చిమ కృష్ణా డెల్టాలో సుమారు 7 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగు చేస్తారని తెలిపారు. డెల్టాలో పంటలు బాగా పండాలంటే నీటిపారుదల సక్రమంగా జరగాలని పేర్కొన్నారు. కావున యుద్ధ ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం పూడికతీత, తూటికాడ, గుర్రపు డెక్కను తొలగించాలని సూచించారు. 800 మరమ్మతుల పనులకు పనులు ప్రతిపాదించి, రూ. 48.27 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేసినప్పటికీ ఇప్పటి వరకు నిధులు మంజూరుకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపక పోవడం దురదృష్టకరమన్నారు. సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంజుల విఠల్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు పుప్పాల సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

18న ధ్యానబుద్ధ వద్ద యోగాంధ్ర

● 2వేల మంది లక్ష్యంగా ఏర్పాట్లు

అమరావతి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 18న ఉదయం 6 నుండి 8.30 గంటల వరకు ప్రసిద్ధ పర్యాటక కేంద్రం అమరావతిలోని ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద సుమారు రెండు వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంత్‌రెడ్డి మండల స్థాయి అధికారులతో కలసి ధ్యానబుద్ధ ప్రాజెక్టు, బుద్ధవనం ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజధాని అమరావతికి ఐకాన్‌గా ఉన్న ధ్యానబుద్ధ ప్రాజెక్టు వద్ద యోగా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు.. అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ యోగా కార్యక్రమంలో జిల్లా, డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, గ్రామాల ప్రజలు, విద్యా సంస్థల నుండి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనేలా చూడాలన్నారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో కొండవీటి కోట, నాగార్జునసాగర్, కోటప్పకొండ వద్ద కార్యక్రమాలు నిర్వహించామని, అమరావతిలో జరిగే కార్యక్రమాన్ని జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో మం డల ప్రత్యేక అధికారి రాజగోపాల్, తహసీల్దారు డానియేలు, ఎంపీడీఓ టి.పార్వతి, టూరిజం అధికారి జి.నాయుడమ్మ, ఈఓపీఆర్డీ కె పద్మజ, ఎంఈఓ శివబాబు, ఎస్ఐ అమీర్, సర్వేయర్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

తల్లికి వందనం.. ఆనందం

(5వ పేజీ తరువాయి)

బ్యాంకుల నుంచి ఎస్ఎంఎస్‌ల ద్వారా నగదు జమైన ట్లు సందేశాలు రావడంతో చాలామంది సాయంత్రానికే ఏటీఎంలకు క్యూ కట్టారు. 14న రెండో శనివారం, 15న ఆదివారం వరుస సెలవుదినాలు కావడంతో శుక్రవారమే నగదు తీసుకునేందుకు ఆసక్తి చూపారు. పాఠశాలలు, కళాశాలలు తెరవడంతో పిల్లలకు అవసరమైన ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగులు వంటివి కొనుగోలు చేసుకోవడానికి తల్లికి వందనం నగదు ఎంతో ఉపయోగపడుతుందని వారు తెలిపారు. తల్లికి వందనం పథకానికి సంబంధించి సచివాలయాల వారీగా సోషల్ ఆడిట్ జరుగుతుందని అభ్యంతరాల స్వీకరణకు జూలై 5 వరకు ప్రభుత్వం గడువు ఇచ్చింది. అర్హులైన ప్రతి ఒక్క విద్యార్థికి పథకం లబ్ధి అందేలా చూస్తామని అధికారులు తెలిపారు. తల్లికి వందనం పథకానికి అర్హులైన వారి జాబితాను సచివాలయాల్లో ప్రదర్శించ నున్నారు. ఇప్పటికే నగదు జమైన తల్లులు ఇంకా ఏవైనా అభ్యంత రాలుంటే సచివాలయాలలో తెలపాలని ప్రభుత్వం సూచించింది. అర్హత ఉండి పథకం అందని వారు వివరాలను సచివాలయాల్లో ఇస్తే త్వర లోనే డబ్బులు జమ అవుతాయని అధికారులు తెలిపారు. బ్యాంకు ఖాతాల విషయంలో తలెత్తిన సాంకేతిక చిక్కులను తొలగించుకోవ డానికి పిల్లల తల్లులు దృష్టిపెట్టాలని అధికారులు కోరుతున్నారు. కొంతమంది తల్లుల ఖాతాల్లో నగదు జమ అయినా వారి బ్యాంకు ఖాతాలు యాక్టివ్‌గా లేకపోవడంతో రిఫండ్ వెళ్లిపోయాయని అధికా రులు చెబుతున్నారు.

నాడు ఒకరికి.. నేడు అందరికీ

వైసీపీ హయాంలో ఎంతమంది పిల్లలున్నా ఒక్కరికే రూ.13 వేల నగదు జమ అయ్యేది. అయితే దీని వల్ల మిగిలిన పిల్లల చదువుల కోసం పేదలు ఇబ్బందులు పడుతుండటాన్ని టీడీపీ అధినేత చంద్ర బాబు గుర్తించారు. సూపర్‌సిక్స్ పేరుతో తీసుకువచ్చిన ఎన్నికల మ్యానిఫెస్టోలో తల్లికి వందనం పథకాన్ని చంద్రబాబు చేర్చారు. పైగా కుటుంబంలో ఒకరికి కాదు.. ఎందరు పిల్లలు ఉన్నా వారి చదువులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు సహా కూటమి నేతలు ప్రకటించారు. తనకున్న బిడ్డలందరి చదువుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నగదు జమ అనడంతో గంపగుత్తగా మహిళలు కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి భారీ మెజార్టీలతో గెలిపించారు. ఎన్నికల ప్రచారంలో చెప్పినట్లుగానే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ నగదు జమ చేయడంతో పేద కుటుంబాల్లో సంతోషాలు రెట్టింపయ్యాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 512.90 అడుగులు ఉంది. ఇది 136.64 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్ బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 900 క్యూసెక్కుల నీరు దిగువకు విడు దల చేస్తున్నారు.

'సంగం' వరి విత్తనాలు సిద్ధం

పొన్నూరు టౌన్(చేబ్రోలు), జూన్ 13(ఆంధ్రజ్యోతి): సంగం డెయిరి విత్తన పరిశోధన విభాగం ఆధ్వర్యంలో రైతులకు అవసరమైన వరి విత్తనాలు సిద్ధం చేసినట్లు వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. సంగం డెయిరి చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పర్యవేక్షణలో రై తులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు అందించేందుకు కొన్నేళ్లుగా సంగం సీడ్ ప్రాజెక్టు పనిచేస్తున్నట్లు వెల్లడించారు. విత్తన పరిశోధన అభివృద్ధి విభా గం రూపొందించిన మేలైన రకాలు ఎస్ఎస్ఆర్-2 పది కేజీల విత్తనాల సంచి రూ.750 , ఎస్ఎస్ఆర్-4 పది కేజీల సంచి రూ.750, బీపీటీ 5204 సర్టిఫైడ్ వరి విత్తనాలు 20 కిలోల సంచి రూ.940, ఫౌండేషన్ విత్తనాలు 20 కిలోలు రూ.1,020కు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతు లు 93984 23590 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

వృద్ధుల సంరక్షణ వారసుల బాధ్యత

● న్యాయమూర్తి సయ్యద్ జియావుద్దీన్



మాట్లాడుతున్న జడ్జి సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): సమాజంలో వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరు గుతోందని, వారి సంరక్షణ బాధ్యత వారసులు తీసుకో వాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ సయ్యద్ జియావుద్దీన్ పేర్కొన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుంటూరులోని జన చైతన్య వేదిక హాలులో నిర్వహించిన ప్రపంచ వృద్ధుల వేధింపుల నివారణ, అవగాహన దినోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. వారసులకు ఇచ్చే ఆస్తుల గిఫ్ట్ డీడ్‌ను తమను సక్రమంగా చూడకపోతే రద్దవుతుందనే అంశాన్ని అందులో పొందుపరచాలని, దీంతో సత్ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం ద్వారా బాధిత వృద్ధులు.. న్యాయం పొందవచ్చని చెప్పారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, మానసిక వికాస నిపుణులు డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు,సేవా సంస్థ చైర్మన్ పావులూరి రమేష్, న్యాయవాది కాళిదాసు, మానవత నేతలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని పలువురి మృతి

వినుకొండటౌన్, జూన్ 13,(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృ తి చెందిన ఘటన మండలంలోని కొత్తపాలెం గ్రామ సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నూజెండ్ల మండలం పెద్దావరం గ్రామానికి చెందిన బండి నారాయణ (29) కుటుంబ సభ్యులతో కలిసి ప్రకాశం జిల్లా మేడపీ వెళ్లి ద్విచక్ర వాహనం తిరిగి స్వగ్రామం వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే నారాయణ మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడికి భార్య సైలు, 8 నెలల కుమార్తె ఉంది. పోలీసులు కేసు నమోదు చేశారు.

మాచర్ల పట్టణంలో..

మాచర్లటౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన మాచర్ల పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణంలోని వివేకానంద ఆశ్రమం సమీపంలో నివాసముంటున్న ఇస్లావత్ సక్రునాయక్ (55) గురు వారం రాత్రి ఆశ్రమ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. వెల్దుర్తి మండలం శ్రీరాంపురం తండా నుంచి ద్విచక్ర వాహనంపై వస్తున్న మేరాజ్యోత్ శివమణినా యక్, పోకూరు వేణు అతనిని ఢీకొన్నారు. సక్రునాయక్ అక్కడికక్కడే మృతిచెం దాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

వట్టిచెరుకూరులో...

వట్టిచెరుకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చమళ్లమూడి, కాట్రపాడు గ్రామాల మధ్య గురువారం రాత్రి ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో మండలంలోని సౌపాడు ఎస్సీ కాలనీకి చెందిన కాండ్రు కిరణ్ తేజ(22) ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు సీఐ రమా నాయక్ వెల్లడించారు. కాండ్రు కిరణ్ గురువారం రాత్రి గుంటూరు నుంచి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా.. కాట్రపాడు వైపు నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. గుంటూరు ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమా నాయక్ తెలిపారు.

ఏఎన్‌యూ పీజీ మూడోవ సెమిస్టర్.. ఫలితాల విడుదల

●20 వరకు పునఃమూల్యాంకన దరఖాస్తుకు అవకాశం

పెదకాకాని, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ మూడవ సెమిస్టర్ పలు కోర్సుల పరీక్ష ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. ఏఎన్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి ఆలపాటి శివ ప్రసాదరావు ఫలితాలను వెల్లడించారు. సీఈ ఆలపాటి శివప్రసాదరావు మాట్లాడుతూ ఎంఏ మ్యూజిక్, ఇంగ్లీష్, ఎంబీఏ(ఇంటర్నేషనల్ బిజినెస్), ఎంఎస్సీ ఎలక్ట్రానిక్స్, ఫోరెన్సిక్ సైన్సెస్, హార్టికల్చర్, ల్యాండ్ స్కేప్ గార్డెనింగ్, ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్ కోర్సుల ఫలితాలను ప్రకటించినట్లు తెలిపారు. పునః మూల్యాంకనం కోసం ఈ నెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడిం చారు. ఫలితాల పూర్తి వివరాలు ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో ఉన్నాయని తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య

వట్టిచెరుకూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్నెపాడు గ్రామానికి చమట శివయ్య(52) అనే కౌలు రైతు అప్పుల భారంతో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. మృతుడి కుమారుడు విష్ణువర్ధన్ ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసినట్లు సీఐ రమా నాయక్ శుక్రవారం తెలిపారు. మండలంలోని కొర్నెపాడు గ్రామానికి చెందిన చమట శివయ్య నాలుగేళ్లుగా ఐదెకరాల భూమిని కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశారు. సరైన దిగుబడి, ధర లభించక సుమారు రూ.10 లక్షల వరకు అప్పులు కావడంతో.. గత కొద్ది రోజులుగా తీవ్ర మనస్థాపానికి గురవు తున్నారు. గురువారం అర్ధరా త్రి శివయ్య పురుగు మందు తాగి, వాంతులు చేసుకుం టుండగా.. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందు తూ మృతి చెందాడు. మృత దేహానికి పోస్టుమార్టం నిర్వహి ంచి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ రమా నాయక్ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

38,365 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 36,095 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 38,365 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 3,866 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9800	11200
334	9500	13500	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13000	334	9500	13500
273	10000	12500	నెంబరు. 5	10000	13500
341	10000	13500	273	----	----
4884	---	---	341	10000	14000
సూపర్ 10	---	---	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	14200	తేజ	10000	14600
షార్క్-1	------	------	బ్యాడిగి	10000	13400
బ్యాడిగి	10000	13000	దేవనూరు డీలక్స్	10000	13800
దేవనూరు డీలక్స్	10000	13000	తాలుకాయలు	4500	7000

కార్పొరేషన్ ఎంహెచ్ఓ రవిబాబుపై వేటు

● మాతృ సంస్థకు సరెండర్ చేస్తూ ఉత్తర్వులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ విధుల్లో నిర్లక్ష్య వైఖరి కారణంగా, ప్రజారోగ్య విభాగ ప్రాధాన్యత మేరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ (ఎంహెచ్ఓ) డాక్టర్ ఎం.రవిబాబుని తమ మాతృ శాఖకు సరెండర్ చేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పరిపాలన అవసరాల రీత్యా గుంటూరు తూర్పు నియోజకవర్గానికి రామారావు, పశ్చిమ నియోజకవర్గానికి సోమశేఖర్‌లను ఇన్‌చార్జి ఎంహెచ్ఓలుగా విధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

ఇద్దరు ఏఈలకు షోకాస్ నోటీసులు

గుంటూరు కార్పొరేషన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో మునిసిపల్ ట్యాప్ కనెక్షన్ల మంజూరులో నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పడేలా వ్యవహరించిన ఏఈలు పి.వెంకటేశ్వరరావు, కె.సాంబశివరావులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ లేని కమర్షియల్ లేదా బహుళ అంతస్తు భవనాలు, నివాస గృహాలకు సాధారణ ఫీజులకు 3 రెట్లు డొనేషన్, నీటి చార్జీలను విధిస్తూ, మీటర్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, అయా నిర్దేశిత నిబంధనలు పాటించకుండా ఏఈలు పి.వెంకటేశ్వరరావు, కె.సాంబశివరావులు ట్యాప్ కనెక్షన్ల కోసం తమ లాగిన్‌ల ద్వారా తుది మంజూరు కోసం ఫైల్ పంపారన్నారు. నగరపాలక సంస్థకు ఆర్థిక నష్టం కలిగించేలా వ్యవహరించిన ఏఈలకు మూడు రోజుల్లో సమాధానం ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేశామని, వారు ఇచ్చే సమాధానం మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో మౌళిక వసతులైన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టడానికి ఏఈల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, ప్రాధాన్యత క్రమంలో చేపట్టడానికి చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం గోరంట్ల, కోదండరాం నగర్, నగరాల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కోదండరాం నగర్‌లో స్థానికులు అందించిన ఫిర్యాదు మేరకు అయా ప్రాంతాల్లో పర్యటించి, పారిశుధ్యం, మౌలిక వసతులను పరిశీలించి తక్షణం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో డీఈఈ శ్రీనివాస్, ఎస్ఎస్ సోమశేఖర్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న పులి శ్రీనివాసులు

నోడల్ అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించాలి

అన్న క్యాంటీన్లను నోడల్ అధికారులు ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని, క్యాంటీన్లలో ఆహార సరఫరాకి నిర్దేశిత సమయాన్ని పాటించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ శుక్రవారం ఆర్టీఓ ఆఫీస్ దగ్గరలోని అన్న క్యాంటీన్‌ని పరిశీలించి, ఆహారం తీసుకుంటున్న వారితో మాట్లాడి సిబ్బందికి తగు ఆదేశాలు జారీ చేశారు.

జూలై 10 నుంచి చాతుర్మాస వ్రత పూజలు

గుంటూరు, జూన్13(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య గురు మఠం వారణాసి, హల్దీపూర్, కర్ణాటక వారి ఆధ్వర్యంలో జూలై 10వ తేదీ నుంచి సెప్టెంబరు 7వ తేదీ వరకు శ్రీ విశ్వా వసు నామ సంవత్సర 22వ చాతుర్మాస వ్రత హోమాలు, పూజలు ఏటుకూరు రోడ్డులో ఉన్న శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో నిర్వహించనున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి అంజనేయులు తెలిపారు. ఆలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో పోస్టర్లను విడుదల చేశారు. వైశ్య గురువు శ్రీ వామనాశ్రమ మహా స్వామిజీ ఆధ్వర్యంలో శాంతి, ప్రజా సంక్షేమం, పంటలు పండి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, ప్రజలకు ఈతి బాధలు తొలగి సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ పూజలు చేస్తున్నట్లు తెలిపారు. నిర్వాహకులు సాయిఈశ్వర్ మాట్లాడుతూ ఎంతో పవిత్రంగా నిర్వహించే చాతుర్మాస్య వ్రత హోమాలు, పూజలకు భక్తిశ్రద్ధలతో ఆర్యవైశ్య ప్రజలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్, కొనకళ్ళ సత్యం, టీఎల్‌వీ వీరాంజనేయులు, రవికుమార్, నిడమానూరు సురేష్, తూనుగుంట్ల నాగేశ్వరరావు, దేవరశెట్టి చిన్ని, ఆతుకూరి నగేష్ తదితరులున్నారు.

అధికారులు ప్రజా మన్ననలు పొందాలి : ఆతుకూరి

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ అధికారులు ప్రజా మన్ననలు పొందేలా పని చేయాలని ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి అంజనేయులు తెలిపారు. నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్‌గా పని చేస్తూ భీమవరం మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయిన అరవపల్లి రాంబాబును జిన్నాటవర్ సెంటర్‌లోని చాంబర్ కార్యాలయంలో శాలువా, పూల కిరీటం, పుష్పగుచ్ఛంతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు, సభ్యులు టీఎల్‌వీ వీరాంజనేయులు, తూనుగుంట్ల నాగేశ్వరరావు, ఆతుకూరి నగేష్, షరాబు కృష్ణమూర్తి, గొల్లపూడి రాంబాబు తదితరులున్నారు.

డిప్యూటీ కంట్రోలర్‌గా హరిప్రసాదు

గుంటూరు(తూర్పు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తూనికలు, కొలతల శాఖ డిప్యూటీ కంట్రోలర్‌గా బీవీ హరిప్రసాదు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీలలో భాగంగా ఆయన ఏలూరు నుంచి గుంటూరుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న షాలేం రాజు ఆ శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయనతో పాటు అసిస్టెంట్ కంట్రోలర్‌గా విధులు నిర్వహిస్తున్న కొండారెడ్డి గాజువాకకు, ఆయన స్థానంలో నరసరావుపేటలో పని చేస్తున్న అల్లురయ్య గుంటూరు కు బదిలీ అయ్యారు. హరిప్రసాదు మాట్లాడుతూ తూనికల్లో జరుగుతున్న మోసాలను అరికడతామని తెలిపారు.

15న యోగా పోటీలు

గుంటూరు(తూర్పు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్ గుంటూరు, ఓంకార్ యోగా ఫెడరేషన్, ఎస్‌కేపీ టెంపుల్ యోగా గ్రూపు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఆర్ అగ్రహారం, గీతా మందిరంలో ఈ నెల 15న యోగా పోటీలు నిర్వహిస్తున్నట్టు వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయవరపు ఆశోక్ కుమార్ తెలిపారు. గీతామందిరంలో జరిగిన విలేకరుల సమావేశంలో పోటీలకు సంబంధించిన ఫ్లెక్సీను ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో పోటీల కన్వీనర్ నోముల వెంకట తాండవ కృష్ణ, ఓంకార్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమ్మవారికి అభిషేకం

గుంటూరు(తూర్పు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మల్లారెడ్డినగర్, శ్రీ అయ్యప్పస్వామి, శ్రీ రామ లింగేశ్వరస్వామి 10వ బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలోని శ్రీ పర్వత వర్ధిని, మాలికాపు రత్తమ్మ అమ్మవార్లకు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకాలు జరిగాయి.

పెమ్మసాని చొరవతో

శ్యామలనగర్, సంజీవయ్యనగర్ ఆర్వోబీల నిర్మాణం

● రూ.159.59 కోట్లు నిధులు మంజూరు చేసిన కేంద్ర రైల్వే శాఖ

● నిర్మాణ పూర్తి బాధ్యత కేంద్రానిదే



దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో సమావేశమైన కేంద్ర మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నగరానికి ఇది నిజంగా శుభపరిణామమే. నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న శ్యామలనగర్, సంజీవయ్య నగర్ రైల్వే లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జీలు మంజూరయ్యాయి. కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో ఈ రెండు ఆర్వోబీలను రైల్వే శాఖ సొంత నిధులతో నిర్మించబోతున్నది. శుక్రవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌కు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ ఈ విషయాన్ని స్వయంగా కేంద్ర మంత్రికి నివేదించారు. శ్యామలనగర్ బ్రిడ్జీకి రూ.78 కోట్ల 46 లక్షలు, సంజీవయ్యనగర్ ఆర్వోబీకి రూ.80 కోట్ల 94 లక్షలను మంజూరు చేసినట్లు తెలిపారు. దీనిపై మంత్రి పెమ్మసాని హర్షం వ్యక్తం చేశారు.

పెమ్మసాని మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా ప్రజలకు చెప్పిన విధంగా గుంటూరుకు అవసరమైన ఆర్వోబీలను ఒక్కొక్కటిగా తీసుకువస్తున్నాం. అందులో భాగంగా శ్యామలనగర్, సంజీవయ్య నగర్ ఆర్ఓబీలను కేంద్ర రైల్వే శాఖ మంజూరు చేసిందన్నారు. ఇందుకుగాను రూ.159.59 కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేకుండా భరించే విధంగా కేంద్ర ప్రభుత్వ రైల్వే శాఖ అంగీకరించిందని చెప్పారు. ఇప్పటివరకు గుంటూరు పార్లమెంటు నియోజకవర్గానికి అవసరమైన ఐదు దశాబ్దాల కలగా ఉన్న శంకర్ విలాస్ ఆర్వోబీతో పాటు గడ్డిపాడు, పెదపలకలూరు, నందివెలుగు, మంగళగిరి ఆర్ఓబీలను తీసుకురాగలిగామని అన్నారు. ఈ ఏడు ఆర్ఓబిలకు గాను రూ.572.47 కోట్లను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది అని, ఇందులో పూర్తి నిధులను కేంద్రమే భరించేందుకు బాధ్యత వహిస్తుందని పెమ్మసాని స్పష్టం చేశారు.

పార్లమెంటు నియోజకవర్గానికి అవసరమైన ఆర్ఓబీల మంజూరుకు సహకరించినందుకు గాను అరుణ్‌కుమార్ జైన్‌కు పెమ్మసాని ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం నగరంలోని 3 వంతెనల వద్ద ఏర్పడుతున్న డ్రైనేజీ, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఎం సుధేష్ణ సేన్, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, ఏడీఆర్ఎం సైమన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటలు సాగు చేయవచ్చు

● డ్వామా పీడీ శంకర్

గుంటూరు సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పథకంలో గుంటూరు జిల్లా రైతులు పండ్ల తోటలు కూడా సాగు చేసుకొనే అవకాశం ఉందని డ్వామా పీడీ వి.శంకర్ తెలిపారు. కలెక్టర్ నాగలక్ష్మి అనుమతితో ఈ ఏడాది పెద్ద ఎత్తున ఉద్యానవన పంటలుగా పిలువబడే పండ్ల తోటల పెంపకానికి శ్రీకారం చుట్టినట్లు శుక్రవారం చెప్పారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద ఉద్యాన పంటలను ప్రోత్సహించటంలో భాగంగా ప్రభుత్వం 16 రకాల పండ్ల తోటలు, 2 రకాల పూలతోటలు, మునగ, పశుగ్రాసం పంటలను చేర్చటం జరిగిందన్నారు. గత ఏడాది జిల్లాలో 206 ఎకరాల్లో ఉద్యానవన పంటలు సాగు చేయటం జరిగిందన్నారు. ఈ ఏడాది 500 ఎకరాల్లో పండ్ల తోటలు, 500 ఎకరాల్లో పశుగ్రాసం, 30 ఎకరాల్లో మునగ తోటలు ఉపాధి హామీ పథకం ద్వారా సాగు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. అర్హత కలిగిన రైతులు ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసుకుంటే మూడేళ్ళ పాటు పంట నిర్వహణ ఖర్చులు చెల్లిస్తామని చెప్పారు. సన్న, చిన్న కారు రైతులు, ఎస్సీ, ఎస్టీలు ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు అర్హులని వివరించారు. ఆసక్తి కలిగిన వారు మండల పరిషత్ అభివృద్ధి అధికారిని, ఉపాధి హామీ పథకం ఏపీఓలను సంప్రదించాలని పీడీ శంకర్ తెలిపారు.

డీపీటీవోగా విమల

● నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎంగా రవికాంత్ బదిలీ

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో)గా సీహెచ్ విమల నియమితులయ్యారు. ప్రస్తుతం డీపీటీవోగా వ్యవహరిస్తున్న ఎం.రవికాంత్‌ను నెల్లూరు జోన్ డిప్యూటీ సీటీఎం (ఓ అండ్ సీ)గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడలోని ఆర్టీసీ కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎంఈ (వర్క్స్)గా పని చేస్తున్న సీహెచ్ విమల గుంటూరు జిల్లా డీపీటీవోగా బదిలీపై రానున్నారు. కాగా రెండు రోజుల్లో రవికాంత్ డీపీటీవో బాధ్యతల నుంచి రిలీవ్ కానున్నారు. సోమ లేక మంగళవారాల్లో నూతన డీపీటీవోగా విమల బాధ్యతలు తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డీఎంగా తులసి

● ప్రస్తుత అధికారి లక్ష్మి బదిలీ

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా కే తులసి నియమితులయ్యారు. ఆమె ప్రస్తుతం సత్యసాయి జిల్లా డీసీఎస్ఎంవోగా విధులు నిర్వహిస్తుండగా గుంటూరు ఇన్‌ఛార్జ్ డీసీఎస్ఎంగా పోస్టింగ్ చేశారు. ప్రస్తుత జిల్లా మేనేజర్ జీ లక్ష్మిని చిత్తూరు డీసీఎస్ఎంగా నియమించారు. బాపట్ల డీసీఎస్ఎం ఇన్‌ఛార్జ్ పీ శ్రీనివాసరావుని కోనసీమకు బదిలీ చేశారు. ఈ మేరకు ఆ సంస్థ వీసీ ఎండీ ఎం జిలానీ శామూన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీల కౌన్సెలింగ్ పారదర్శకంగా నిర్వహించాలి

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఉద్యోగుల బదిలీలను నిర్వహించడం జరుగబోతుందని, ఆ బదిలీలను ప్రాంతీయ వైద్య సంచాలకులు జోన్ 3 కార్యాలయం వారు కచ్చితంగా వ్యక్తిగతమైన కౌన్సెలింగ్ నిర్వహించాలని ఏపీ ఎన్జీజీవో గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఏపీ జేఏసీ గుంటూరు జిల్లా చైర్మన్ ఘంటసాల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. ఆ విధంగా కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా బదిలీలు పారదర్శకంగా జరిగి ఉద్యోగస్తులు అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. వ్యక్తిగతమైనటువంటి కౌన్సెలింగ్‌ని నిర్వహించకుంటే ఆర్డీ ఆఫీస్ జోన్ 3 ముందు నిరసన తెలియజేస్తామని ఆయన హెచ్చరించారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం


గుంటూరు, జూన్13(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా రెండో శనివారం పురస్కరించుకొని నగరంలోని వేర్వేరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గుంటూరు టౌన్1 ఆపరేషన్ ఈఈ టి శ్రీనివాసబాబు ఒక ప్రకటనలో తెలిపారు. వేర్వేరు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ లైన్‌ల నిర్వహణతో పాటు చెట్ల కొమ్మలు తొలగించటం వంటి పనులతో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

కష్టకాలంలో పనిచేసిన వారికి గుర్తింపు

● వైసీపీ జిల్లా పరిశీలకుడు పోతిన మహేష్

గుంటూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): పార్టీ కష్టకాలంలో అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని వైసీపీ జిల్లా పరిశీలకులు పోతిన మహేష్ తెలిపారు. వైసీపీ లీగల్‌సెల్ సమావేశం జేకేసీ కళాశాల రోడ్డులోని ఓ హోటల్లో శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెడుతోన్న అక్రమ కేసులపై వైసీపీ లీగల్‌సెల్ ప్రతినిధుల న్యాయ పోరాటం అద్భుతమన్నారు. ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం లీగల్ సెల్ నాయకులు చేస్తోన్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, పార్టీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైసీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, పి.వెంకటరెడ్డి తదితరులున్నారు.

ఇన్‌కం ట్యాక్స్ వాల్యూయర్ రాఘవరావు సతీమణి మృతి



కోటపాటి శైలజ

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బ్యాంకులు, ఇన్‌కం ట్యాక్స్ వాల్యూయర్ కోటపాటి రాఘవరావు సతీమణి శైలజ(60) హఠాన్మరణం చెందారు. శుక్రవారం నవభారత్‌నగర్ 5వ లైనులోని స్వగృహంలో శైలజ బెడ్‌రూంలో అచేతనంగా పడిపోయి ఉన్నారు. రాఘవరావు కోర్టు పని మీద హైదరాబాద్ వెళ్లారు. తన భార్య ఫోన్ లిఫ్ట్ చేయకపోతుండటంతో సమీప బంధువు అయిన డాక్టర్ నూతక్కి శ్రీధర్‌ను వెళ్లి చూడమని కోరారు. డాక్టర్ శ్రీధర్ వెళ్లి డోర్ లాక్ తీయించి చూడగా శైలజ అచేతనంగా కిందపడిపోయి ఉన్నారు. దాంతో ఆమెను హుటాహుటీన లలిత హాస్పిటల్‌కి తరలించారు. వైద్యులు పరీక్షించి వేకువజామున 4.30కి శైలజ చనిపోయారని నిర్ధారించారు. రాఘవరావు, శైలజ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిద్దరూ అమెరికాలో స్థిరపడ్డారు. తల్లి మరణవార్త తెలుసుకొని భారతదేశానికి బయలుదేరారు. ఆదివారం సాయంత్రం/సోమవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని రాఘవరావు తెలిపారు.

ఏడాదిలోనే 70 శాతం హామీల అమలు

● మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ఏడాది కాలంలోనే కూటమి ప్రభుత్వం 70 శాతం హామీలను నెరవేర్చిందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందుకు ప్రజలను వంచించి వారి ఓట్లు దండుకోవాలనే దురుద్దేశంతో నోటికొచ్చిన హామీలన్ని ప్రకటించి, తీరా అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల పాటు కేవలం 12 శాతం హామీలు అమలు చేసి, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకతతో జగన్‌రెడ్డి గతేడాది జరిగిన ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవిచూశాడన్నారు. పరిపాలన అంటే ప్రజలకు ఒక నమ్మకం, ప్రభుత్వంపై వారికి భరోసా కల్పించడమన్నారు. ఏడాదిపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు అదే చేసి చూపించారు. ఎన్నికల ముందు రాష్ట్ర ప్రగతి, ప్రజా సంక్షేమానికి ఒక ప్రణాళిక బద్ధంగా హామీలు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన రోజునుంచే సూపర్ సిక్స్ పథకాల అమలుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. దీపం-2 ద్వారా కోటి కుటుంబాలకు చెల్లించామన్నారు. ప్రతి విద్యార్థికి రూ.13 వేలు చొప్పున తల్లికి వందనం అమలు చేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి కేంద్ర నిధులతో కలిపి రాష్ట్ర ప్రభుత్వం జూన్ 20న విడుదల చేయబోతుందన్నారు.

ప్రభుత్వ గుర్తింపు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

గుంటూరు (తూర్పు), జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఇంటర్ బోర్డు గుర్తింపు లేకుండా తరగతులు నిర్వహిస్తున్న ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బండారపు యశ్వంత్ డిమాండ్ చేశారు. స్థానిక పట్టాభిపురంలోని ఓ ప్రైవేటు కళాశాల ఎదుట విద్యార్థులు చేపట్టిన ధర్నాలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో యాజమాన్యాలు తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. తక్షణమే ఆర్ఐవో స్పందించి అయా యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో ప్రణీత్, అమర్‌నాథ్, వెంకట్, అజయ్, గణేష్, సాయి, సతీష్ పాల్గొన్నారు.

సాహితీమూర్తి డాక్టర్ సీనారె

గుంటూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): భారత సాహిత్యం గర్వించదగ్గ సాహితీమూర్తి డాక్టర్ సింగిరెడ్డి నారాయణ రెడ్డి అని కళా సౌధ అధ్యక్షుడు బిక్నా అశోక్ తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రముఖ సాహితీవేత్త దివంగత సినారె వర్ధంతి కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ సుమారు ఏడు దశాబ్దాల సాహితీ ప్రస్థానంలో సినారె 90కి పైగా గ్రంథాలు రచించారన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్య దర్శి కొండా శివరామిరెడ్డి, పింగళి భాగ్యలక్ష్మి, లక్ష్మి, బాబురావు, మల్లేశ్వర రావు, రాజ్యలక్ష్మి తదితరులున్నారు.

గజవాహనంపై శ్రీవారి రథోత్సవం

గుంటూరు (తూర్పు)జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌వీఎన్ కాలనీ శ్రీ పద్మావతి గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 23వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం స్వామి, అమ్మవార్ల రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. 42వ డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ ప్రసాద్ విచ్చేసి రథోత్సవాన్ని ప్రారంభించారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

అపర సంజీవనిగా సీఎం రిలీఫ్ ఫండ్

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బాధితులకు ఆర్థిక చేయూతనిస్తూ ముఖ్యమంత్రి సహాయనిధి అపర సంజీవనిగా పని చేస్తోందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. నగరంలోని షేక్ కరిమున్నీసా, చేవూరి రమాదేవి, కందుల శివసృజన్ రామిరెడ్డి వివిధ అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స తీసుకున్నారు. వారు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. కరిమున్నీసాకు రూ.1,49,538, చేవూరి రమాదేవికి రూ.2,32,099, కందుల శివసృజన్ రామిరెడ్డికి 1,00,280 మంజూరయ్యారు. వాటిని ఎమ్మెల్యే బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఏడాది పాలన ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా సాగిందని తెలిపారు. ఒక విజనరీ లీడర్ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో తిరిగి రాష్ట్రంలో ప్రగతికి బాటలు పడ్డాయని వివరించారు. యువత భవితకు సరికొత్త చిరునామాగా సాగిన ఏడాది సుపరిపాలనను ప్రజలందరూ పెద్ద మనసుతో దీవిస్తున్నారని అన్నారు. మరింత సేవ చేసే విధంగా పాలన అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సజీలా, కార్పొరేటర్లు ముప్పవరపు భారతి, పోతురాజు సమత, వేముల జ్యోతి, శనక్కాయల రాజకుమారి, రిహానా, మాజీ కార్పొరేటర్ నల్లపునేని విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ పొందారు..!

సూపర్ సిక్స్‌లో..తల్లికి వందనం పథకాన్ని కూటమి ప్రభుత్వం దిగ్విజయంగా అమలు చేసింది. హామీ ప్రకారం ఎంతమంది పిల్లలు బడికెళ్తే.. అంతమందికీ.. రూ.13 వేలు లెక్కన వారి తల్లుల ఖాతాల్లో జమ చేసి.. మాట నిలబెట్టుకున్న క్రెడిట్ పొందింది. బడి గంట మోగిన వెంటనే పిల్లల ఖర్చులెలా అని ఎదురు చూస్తున్న తల్లిదండ్రులు.. తమ ఖాతాలో పథకం డబ్బులు క్రెడిట్ కావడంతో హర్షం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబంలో ఇద్దరు, ముగ్గురు పిల్లల వారి ఆనందానికి ఇక హద్దులు లేవు. కూటమి ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబు నాయుడుకి ధన్యవాదాలు తెలుపుకున్నారు.

ఒకే కుటుంబంలో నలుగురికి, మరో కుటుంబంలో ముగ్గురికి



సలోమాను, ఫాతిమా కుటుంబం



గల్లా పిచ్చహరి, మల్లేశ్వరి కుటుంబం

మాచవరం, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు విడుదల చేసిన తల్లికి వందనం జాబితాలతో ఆయా గ్రామాల్లో ఆనందోత్సాహాలు వ్యక్త మవుతున్నాయి. కుటుంబంతో ఎంత మంది ఉంటే అంత మంది పిల్లలకు తల్లికి వందనం ఇస్తానని ఇచ్చిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు తల్లికి వందనం పథకం మంజూరు చేయడంతో తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్త పరుస్తున్నారు. మాచవరం మండలంలోని వేమవరం గ్రామానికి గల్లా సలోమాను, గల్లా పాతిమా అనే దంపతులకు ఐదుగురు సంతానం. వీరిలో నలుగురు జాబితాలో రాగా మరొకరు 10వ తరగతి అయి పోవడంతో ఈ నెల 30న మరో జాబితాలో అమ్మాయి రానున్నది. దీనిని బట్టి కుటుంబంలో ఉన్న ఐదుగురు పిల్లలకు తల్లికి వందనం వర్తిస్తుంది. అదే విధంగా అదే గ్రామానికి చెందిన గల్లా పిచ్చహరి, గల్లా మల్లేశ్వరి దంపతులకు నలుగురు సంతానం. వీరిలో ముగ్గురు పేర్లు జాబితాలో వచ్చాయి. మరొక అమ్మాయి 10వ తరగతి పాసవ్వటంతో ఈ నెల 30వ తేదీన విడుదల కానున్న మరో జాబితాలో రానున్నది. దీనిని బట్టి వారి కుటుంబంలో కూడా నలుగురికి తల్లికి వందనం వర్తిస్తుంది. ఇలా అనేక మంది కుటుంబాల వారికి ముగ్గురు నుంచి నలుగురు పిల్లలకు తల్లికి వందనం వర్తించే విధంగా అవకాశాలు మెండుగా ఉన్నాయి. మొత్తం మీద తల్లికి వందనం జాబితాలు రిలీజ్ చేయటంతో ఆయా గ్రామ సచివాలయాల్లో సందడి నెలకుంది.

ఇచ్చిన హామీ పక్కాగా అమలు



తుళ్లూరు, జూన్ ,(ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికలప్పుడిచ్చిన తల్లికి వందనం పక్కాగా అమలు చేసింది. ఇంటిలో ఎంత మంది చదువుకునే పిల్లలు ఒకటవ తరగతి నుంచి పన్నెండవ తరగత వరకు విద్యార్థులుంటే అంత మందికి సంత్సరానికి రూ.13 వేలు తల్లుల ఖాతాల్లో శుక్రవారం నుండి జమ కావడం ప్రారంభమైంది. మండల పరిధిలోని ఐనవోలు గ్రామానికి చెందిన ఒకే ఇంటిలోని పోతు రాజు ప్రవీణ్ , శివసేంద్, లాస్యకు తల్లికి వందనం పథకం కింద ఖాతాలో డబ్బులు జమ అయినట్లు కూటమి నాయకులు తెలిపారు. పథకం పారదర్శకంగా అమలు చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, గుంటూరు ఎంపీ, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమాలకు కూటమి నేతలు కృతజ్ఞతలు తెలిపారు. పేదల పక్షాన నిలబడి కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, జనసేన మండల అధ్యక్షుడు యర్రగోపు నాగరాజు , బీజేపీ అధ్య క్షుడు నీరుకొండ లక్ష్మీ నారాయణలు పేర్కొన్నారు.

పార్టీలకతీతంగా వలంటీర్ కుటుంబానికి నగదు జమ



ముగ్గురు పిల్లలతో కూనల రామయ్య



ముగ్గురు పిల్లలతో తల్లిదండ్రులు గంగారం సుభాని, గౌసియా

ముప్పాళ్ళ జూన్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో బాగంగా తల్లికి వందనం నగదును విద్యార్థుల తల్లి దండ్రుల ఖాతాలో శుక్రవారం జమ చేసింది. ఒకే ఇంటిలో ముగ్గురు విద్యార్థులు చదువుతున్నా వారందరికీ తల్లికి వందనం పథకంలో బాగంగా డబ్బులను తల్లుల ఖాతాల్లో నగదు వేశారు. పార్టీలకు అతీతంగా వలంటీర్ కుటుంబ సభ్యులకు నగదు వారి ఖాతాలో జమ అయ్యింది. దీంతో గ్రామాలలో తల్లుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. గతంలో ఇంటిలో ఎంతమంది చదువుతున్నా ఒక్కరికి మాత్రమే వైసీపీ ప్రభుత్వం ఇచ్చింది. రుద్రవరం ఎస్సీ కాలనీకి చెందిన కూనల రామయ్య, సుజాత లకు ముగ్గురు సంతానం కాగా గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో పెద్దకూతురు సంజన 5వతరగతి, రెండవ అమ్మాయి మోక్ష 3వ తరగతి, కొడుకు రక్షణ్ తేజ్ 1వతరగతి గతేడాది చదివారు. ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం రావడంతో తండ్రి రామయ్య ఆనందం వ్యక్తం చేశారు. ముప్పాళ్ళకు చెందిన షేక్ గంగారం సుభాని, గౌసియా దంపతులకు ముగ్గురు పిల్లలు పెద్దకుమార్తె ముప్పాళ్ల హైస్కూల్‌లో ఆసియా 10వ తరగతి, కుమారడు ఆసిఫ్, నరసరావు పేటలోని ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి, మరో కుమారుడు అర్షద్ ముప్పాళ్ళలోని ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. వీరికి తల్లికి వందనం నగదు ఖాతాలో జయ అయ్యింది. మండలంలోని నార్నెపాడులో నాయుడు శ్రీను, నాగాంజలిల ముగ్గురు పిల్లల వెంకటేష్ 7వ తరగతి, షన్ముఖ సాయి 5వ తరగతి, రమ్యశ్రీ 2వ తరగతి గ్రామంలోని ప్రైవేటు పాఠశాల జీఎంఆర్ మెమోరియల్‌లో చదువుతున్నారు. వారికి కూడా తల్లికి వందనం పథకం వర్తించి ఖాతాలో నగదు పడింది. గ్రామాల్లో పాఠశాలలు పునఃప్రారంభం రోజునే.. తల్లికి వందనం జమకావడంతో తమ పిల్లలను సంతోషంగా ఏ కష్టం లేకుండా చదివించుకుంటామని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



షేక్ బుజ్జి, భర్త సుభానీతో ముగ్గురు పిల్లలు

సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటాం

పెదకూరపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతక మందికి కూటమి ప్రభుత్వం శుక్రవారం నగదును జమ చేసింది. పెదకూరపాడుకు చెందిన షేక్ బుజ్జి భర్త సుభానీలు, తమ ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం పథకం నగదు రావడం తమకెంతో ఆనందంగా ఉందని సంతోషం వ్యక్తం చేశారు. షేక్ ఆసీఫా తనకు ఉన్న ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం పథకం ద్వారా నగదు జమ అయిందని తెలిపారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే ప్రవీణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

విత్తనాల విఫణిలో.. జిల్లాకు నకిలీ మరకలు

- భద్రాద్రి కొత్తగూడెంలో నకిలీ మిర్చి విత్తనాలు పట్టివేత
- మహబూబ్ నగర్‌లో దొరికిన బీటీ3 పత్తి విత్తనాలు
- రెండు తెలుగు రాష్ట్రాలకు గుంటూరు నుంచే సరఫరా
- నిద్రపోతున్న నిఘా వ్యవస్థ

గుంటూరు సిటీ, జూన్ 13(ఆంధ్రజ్యోతి): గుంటూరులో తయారువుతున్న నకిలీ విత్తనాలు రెండు తెలుగు రాష్ట్రాలను వణికిస్తున్నాయి. మొన్న తెలంగాణలోని మహబూబ్‌నగర్‌లో నకిలీ పత్తి విత్తనాలు దొరికితే.. నేడు భద్రాద్రి కొత్త గూడెంలో నకిలీ మిర్చి విత్తనాలు దొరికాయి. ఈ విత్తనాలు గుంటూరు విత్తనాల షాపులోనే విక్రయించినట్లు అక్కడి పోలీసులు తేల్చారు. గుంటూరు నగర పరిసర ప్రాంతాల్లోనే నకిలీ విత్తనాల మాఫియా పెద్ద ఎత్తున నిల్వలు తయారు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేకపోవడం దృష్టి సారించాల్సిన అంశం. ఎక్కడెక్కడి నుంచో విత్తనాలు తీసుకువచ్చి ఇక్కడ కొత్తగా ప్యాక్ చేసి.. మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నారు.

రాణీ బెంగళూరు నుంచి తెచ్చి

కర్ణాటకలోని రాణీ బెంగళూరులో ఎక్కువగా మిర్చి విత్తనాల ప్రాసెసింగ్ జరుగుతుంది. అక్కడ ప్రముఖ కంపెనీలు ఫెయిల్ అయిన విత్తనాలను లూజ్‌లో విక్రయిస్తాయి. కేజీ కేవలం రూ. 6 వేల నుంచి రూ. 10 వేల వరకు విక్రయిస్తారు. వాటిని ఇక్కడకు తెస్తున్న కొందరు వ్యాపారులు వేరే బ్రాండ్‌ల పేరుతో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. మంచి కంపెనీ విత్తనాల ధర కేజీ రూ.లక్ష పైగానే ఉంటుంది. ఫెయిల్ అయిన విత్తనాలను తీసుకువచ్చి చక్కగా ప్యాక్ చేసి కేజీ కేవలం రూ.40 వేల నుంచి రూ. 60 వేలకు విక్రయిస్తారు. షాప్‌లో దొరికే విత్తనాల ధరకు, బయట విత్తనాల ధరకు బాగా వ్యత్యాసం ఉండటంతో కొందరు రైతులు ఆ వైపుగా మొగ్గు చూపుతున్నారు. అవి సరిగా మొలవక, మొలిచినా కాపు, దిగుబడి రాక అల్లాడిపోతుంటారు. పత్తి విత్తనాలు కూడా గుజరాత్ ప్రాంతం నుంచి లూజ్‌లోనే ఎక్కువగా తెచ్చి అమ్ముతున్నారు. తెలంగాణలో సీజన్ ముందే ఆరంభం అవుతుంది.. కాబట్టి మొదట అక్కడి మార్కెట్‌పై దృష్టి సా రిస్తారు. ఆ తర్వాత ఆంధ్రలో విక్రయాలు జరుపుతున్నారు.



భద్రాద్రి కొత్త గూడెం లో దొరికిన నకిలీ మిర్చి విత్తనాల ప్యాకెట్ లు

ప్రముఖ కంపెనీల్లో పనిచేసి..

ప్రస్తుతం గుంటూరు కేంద్రంగా నకిలీ విత్తనాల వ్యాపారం చేస్తున్న వారంతా ఒకప్పుడు ప్రముఖ కంపెనీ లలో పనిచేసిన వారే. అక్కడ ఉన్న అనుభవంతో సొంతగా వ్యాపారం ఆరంభించి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నారు. ఈ రకమైన వ్యాపారం చేసే వారికి వ్యవసాయశాఖ, ఇతర నిఘా విభాగంలో పనిచేసే అధికారులతో మంచి సంబంధాలు ఉంటాయి. ఉదాహరణకు గుంటూరు వ్యవసాయ శాఖలో కీలకంగా పనిచేస్తున్న ఒక ఏఓ స్నేహితుడు ఇటువంటి వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అదే కార్యాలయంలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి మేనల్లుడు ప్రస్తుతం తెలంగాణ విత్తనాల వ్యవహారంలో దొరికినట్లు చెబుతున్నారు. ఇలా నకిలీ, అనుమతి లేని విత్తనాల వ్యాపారం చేసే వాళ్లకు.. ఎక్కడో చోట అభయ హస్తం దొరుకుతోంది.

ఇంకా నిద్రావస్థలోనే...

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ఆరంభం అయినా వ్యవసాయ, విజిలెన్స్ శాఖలు నిద్ర మేల్కొన్న దాఖలాలు కనిపించడం లేదు. నకిలీ విత్తనాలు ఇప్పటికే విస్తారంగా గ్రామాలకు వెళ్లినా ఎక్కడా కూడా నామ మాత్రపు తనిఖీలు లేవు. ఏడాదిలో అసలు తనిఖీలు జరిగిన సందర్భాలు లేవని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నగరంలోని 34 పార్సిల్ కేంద్రాలు ఉన్నా.. వాటిలో కూడా పెద్దగా సోదాలు జరగడం లేదు. నగర పరిధిలోని వ్యవసాయ నిఘా విభాగం పూర్తి గా నిద్రావస్థలో ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రిమోట్ లొకేషన్‌తో..

గుంటూరు రైల్వే డివిజన్‌కు నష్టం

- రిజర్వేషన్‌లో కోల్పోనున్న కొన్ని రైళ్ల బెర్తులు
- ఈక్యూ బెర్తుల కోసం ప్రత్యేక చార్ట్ అనవసరం

గుంటూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జనరల్ కోటా నుంచి గుంటూరు రైల్వే డివిజన్‌ని రిమోట్ లొకేషన్‌కు మారుస్తున్నందున రిజర్వుడ్ టిక్కెట్ల పరంగా ఆదాయాన్ని కోల్పోనుంది. ఇదే సమయంలో ఇక్కడి ప్రయాణికులకు ఆయా రైళ్లలో బుకింగ్ చేసుకోవడానికి బెర్తుల సంఖ్య తగ్గిపోతుంది. ఈ నష్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఎమర్జెన్సీ కోటా బెర్తులను విడుదల చేసేందుకు అదనపు సమయం వస్తుందన్న ఆలోచనతో రిమోట్ లొకేషన్ చార్టింగ్‌కు ఇక్కడి కమర్షియల్ విభాగం అధికారులు ఆమోదించడంపై ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైల్వే శాఖ తీసుకొన్న ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలని కోరుతున్నారు.

మీటర్ గేజ్‌గా ఉన్న సమయంలో అమరావతి ఎక్స్‌ప్రెస్ గుంటూరు నుంచి హుబ్లీకి రాకపోకలు సాగించేది. బ్రాడ్‌గేజ్‌గా మారిన తర్వాత ఈ రైలుని విజయవాడ వరకు పొడిగించారు. గత ఏడాది ఈ రైలుని ఏకంగా నరసపూర్ వరకు తీసుకెళ్లారు. దీంతో అమరావతి ఎక్స్‌ప్రెస్ ప్రస్తుతం నరసపూర్ - హుబ్లీ మధ్యన రాకపోకలు సాగిస్తోంది. కాగా ఇప్పటి వరకు నరసపూర్ నుంచి డోన్ వరకు జనరల్ కోటా ఈ రైలుకు ఉండేది. దీని వల్ల స్లీపర్, ఏసీ త్రీటైర్, టూటైర్ బెర్తులు పుష్కలంగా అందుబాటులో ఉండేవి. అయితే ఎమర్జెన్సీ కోటా బెర్తులను విజయవాడ డివిజన్‌తో కలిసి గుంటూరు డివిజన్ పంచుకోవాల్సి వచ్చేది. ఈ కారణంగా ఇక్కడికి వచ్చిన ఈక్యూ విజ్ఞప్తులను విజయవాడ డివిజన్‌కు పంపితే అక్కడి అధికారులు కన్‌ఫర్మ్ చేసేవారు. అయితే గుంటూరుని రిమోట్ లొకేషన్‌లో పెట్టాలని డివిజనల్ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఈ కారణంగా గుంటూరు నుంచి డోన్ వరకు అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ క్లాస్ బెర్తులు కేవలం 12, ఏసీ త్రీ టైర్ బెర్తులు నాలుగు మాత్రమే ప్రయాణికులు బుకింగ్ చేసుకోవడానికి అనుమతి ఉంటుంది. ఏసీ టూటైర్‌లో ఒక్క బెర్తు కూడా బుకింగ్‌కు కేటాయించలేదు. మరోవైపు విజయవాడ నుంచి పుష్కలంగా బెర్తులు అందుబాటులో ఉంటాయి. దీంతో ఇక్కడి ప్రయాణికులు కూడా విజయవాడ నుంచి బుకింగ్ చేసుకొని బోర్డింగ్ చేంజ్ పెట్టుకొంటున్నారు. ఈ కారణంగా ఆయా టిక్కెట్ల ఆదాయం అంతా విజయవాడకు వెళ్లిపోతుంది.

ఇదే విధంగా వారంలో మూడు రోజుల పాటు గుంటూరు మీదగా రాకపోకలు సాగించే మచిలీపట్నం - యశ్వంత్‌పూర్ కొండవీడు ఎక్స్‌ప్రెస్‌కి కూడా బెర్తుల సంఖ్య తగ్గింది. ఈ రైలుకు స్లీపర్ 52, ఏసీ త్రీటైర్ 37, ఏసీ టూటైర్ 9, ఫస్టు ఏసీ రెండు మాత్రమే కేటాయించారు. ఇదే రైలుకు విజయవాడ డివిజన్‌కు స్లీపర్ క్లాస్ 138, ఏసీ త్రీటైర్ 233, ఏసీ టూటైర్ 41, ఫస్టు ఏసీ 14 బెర్తుల కోటా కలిగి ఉంది. వాస్తవంగా ఈ రైలు ఎక్కువ దూరం ప్రయాణం చేసేది గుంటూరు రైల్వే డివిజన్‌లోనే. అయినప్పటికీ విజయవాడ కంటే తక్కువ బెర్తులు కేటాయించడం వల్ల ఇక్కడ వెయిటింగ్ లిస్టు ప్రారంభం కాగానే ప్రయాణికులు విజయవాడ నుంచి బుకింగ్ చేసుకొంటుండటంతో ఆ ఆదాయాన్ని గుంటూరు కోల్పోవాల్సి వస్తోంది.

ఐకానిక్ టవర్ల నిర్మాణానికి..

పర్యావరణ అనుమతులకు సీఆర్డీఏ లేఖ

- ఎస్ఈఐఏఏకు నివేదిక పంపిన సీఆర్డీఏ
- 2018లో జారీ చేసిన టీఓఆర్‌తో సమగ్ర నివేదిక
- వైసీపీ కుట్రల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు

గుంటూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన ఐకానిక్ సెక్రటేరియట్ భవన సముదాయానికి పర్యావరణ అనుమతులు కోరుతూ ఏపీ సీఆర్డీఏ లేఖ రాసింది. స్టేట్ లెవెల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అథారిటీ (ఎస్ఈఐఏఏ)కి సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ ఈ మేరకు వివరాలు సమర్పించారు. ఐకానిక్ భవన సముదాయంలో నిర్మిస్తున్న పరిపాలనా భవనాలు, సీఎంఓ వివరాలన్నీ సంబంధిత అధికారులకు పంపారు. 2018లో జారీ చేసిన టెర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్(టీఓఆర్)ను జత చేసి సమగ్ర నివేదికను అధికారులకు అందజేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో డయా గ్రిడ్ విధానంలో మొత్తం 5 టవర్లు నిర్మిస్తున్నారు. వీటిలో నాలుగు పరిపాలన భవనాలు కాగా, ఒకటి ముఖ్యమంత్రి కార్యాలయంగా ఉంటుంది. రాజధాని పునర్నిర్మాణ ప్రక్రియ మొదలైన నాటి నుంచి వైసీపీ నేతలు కొందరు అడ్డుకోవడానికి అనేక విధాలుగా ప్రయత్నాలు చేస్తూ ఉన్నారు. రాజధాని నిర్మాణానికి రుణ సహాయం అందజేయడానికి ముందుకు వచ్చిన ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకులకు లేఖలు రాయడం, రాజధాని ప్రాంతంలో పర్యటనకు వచ్చిన ప్రపంచ బ్యాంకు పరిశీలన బృందాన్ని తప్పుదోవ పట్టించడానికి అనేక ప్రయత్నాలు చేశారు. అవేవీ ఫలించకపోవడంతో పర్యావరణ సమస్యలను లేవనెత్తి అడ్డుకునే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, సీఆర్డీఏ అప్ర మత్తమైంది. పర్యావరణ సమస్యలు ఇప్పుడు, భవిష్యత్తులో లేవనెత్తే అవకాశం లేకుండా సీఆర్డీఏ పటిష్ఠ చర్యలు తీసుకోవడంలో భాగంగా ఈ లేఖ రాసింది.

రాజధాని జీవవైవిధ్యంపై క్షేత్రస్థాయి మూల్యాంకన

- రెండోరోజు వర్క్‌షాపులో పాల్గొన్న వివిధ విభాగాల ప్రముఖులు
- పలు అంశాలపై చర్చలు



అమరావతిలో పర్యటన అనంతరం ప్రముఖుల గ్రూప్ ఫొటో



విజయవాడ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణంలో 'జీవ వైవిధ్యం, పర్యావరణ అభివృద్ధి' అంశంపై నిపుణుల నేతృత్వంలో జరిగిన రెండోరోజు వర్క్‌షాపు ముగిసింది. శుక్రవారం ఢిల్లీకి చెందిన నిపుణుల బృందం అనంతవరం హిల్స్, శాకమూరు పార్క్, ఏజీసీ ప్రాంతం, హైకోర్టు, సీడ్ యాక్సెస్ రోడ్, ఏడీసీఎల్, వాటర్‌బాడీ, వెంకటపాలెం నర్సరీ వంటి కీలకమైన పర్యావరణ ప్రాంతాలను సందర్శించింది. ఈ ప్రదేశాలు అమరావతి గ్రీన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లానింగ్‌లో అంతర్భాగాలుగా ఉన్నాయి. అనంతరం ఏడీసీఎల్ హార్టికల్చర్ బృందంతో కలిసి వివిధ జాతుల చెట్లు పెరగడానికి అనుకూలమైన స్థలం, డిజైన్ మెరుగుపరిచే విధానంపై కార్యాచరణ రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు లోబడి అమరావతిని ప్రకృతిలో ఎలా అనుసంధానం చేయాలో ఈ బృందాలు వివరించాయి. అనంతరం ఏపీ సీఆర్‌డీఏ భవనంలో జరిగిన సమావేశంలో ఢిల్లీకి చెందిన నీలా హౌస్ కన్‌స్ట్రక్టెడ్ వెట్ ల్యాండ్ సంస్థ సభ్యులు మొక్కలు, జలసంబంధమైన ప్రణాళికల గురించి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇందులో పర్యావరణాన్ని పునరుద్ధరించే మొక్కల జాతులు గురించి ప్రదర్శించారు. అనంతరం అమరావతి గ్రీన్‌ఎనర్జీ మౌలిక సదుపాయాలు, పార్కులు, అవెన్యూలు, బఫర్ ప్లాంటేషన్, నగర వ్యాప్తంగా నీలి, ఆకుపచ్చ పర్యావరణ నెట్‌వర్క్ అభివృద్ధి గురించి ప్రెజెంటేషన్ చేశారు. ముగింపు సెషన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు తమ సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఢిల్లీ విశ్వవిద్యాలయ వర్గీకరణ శాస్త్రవేత్త, మాజీ వైస్ చాన్సలర్ సీఆర్ బాబు, శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ వృక్షశాస్త్ర ప్రొఫెసర్ రవిప్రసాద్, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ అధికారి ఎన్.చంద్రమోహన్ రెడ్డి, ఏడీసీఎల్ హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ జాయింట్ కలెక్టర్ డైరెక్టర్ ధర్మజ, సీనియర్ ప్లానర్ ప్రమాన్‌కుమార్, ఏపీసీఆర్‌డీఏ స్ట్రాటజీ డివిజన్ డైరెక్టర్ ఎన్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల భవిష్యత్తు ఇక సెట్

- ప్రభుత్వ జూ.కళాశాలల్లో ఈఏపీ సెట్, నీట్ శిక్షణ
- కీలక నిర్ణయం తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- సమయ ప్రణాళికపై ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు

సత్తెనపల్లి జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకూడదని కూటమి ప్రభుత్వం కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఈఏపీ సెట్, నీట్‌లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులను సన్నద్ధం చేయాలని మార్గదర్శకాలను రూపొందించింది. ఇందుకు అవసరం అయిన పుస్తకాలను ప్రభుత్వ కళాశాలలకు అందజేసింది. పల్నాడు జిల్లాలోని ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2,700 మంది ఉన్నారు. మొదటి సంవత్సరంలో 2,500 మంది అడ్మిషన్లు పొందనున్నారని సమాచారం. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ జూనియర్, ఆదర్శ కళాశాలలు, కెజీబీవీలు, రెసిడెన్సియల్ కళాశాలలు, హైస్కూల్ ప్లస్‌లు 62 ఉన్నాయి. ఇప్పటి వరకూ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు 5 నుండి 10 శాతం మంది మాత్రమే ఇంజనీరింగు, వైద్య సీట్లు పొందుతున్నారు. ఉన్నత విద్య చదవాలని పేద విద్యార్థులకు ఉన్నప్పటికీ సరైన శిక్షణ లేకపోవడంతో వెనుకబడి పోతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు ప్రధాన సబ్జెక్టులుగా బోధిస్తున్నారు. ఇంజనీరింగు, మెడిసిన్ శిక్షణ తీసుకోవాలంటే ప్రవేటుగా రూ.లక్షలు ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. కూటమి ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గనుంది. ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ పాఠ్యాంశాలతో పాటు ఈఏపీ సెట్, నీట్ తదితర పోటీ పరీక్షలు రాసేందుకు శిక్షణ ఇవ్వాలని ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరు మెటీరియల్ సిద్ధం చేసి ఆయా కళాశాలలకు ఇప్పటికే పంపడం జరిగింది. పాఠ్యాంశాల బోధనతోపాటు వీటికి సంబంధించిన సమయ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లను ఆదేశించినట్లు డీఐఈఓ కె.సుచరిత తెలిపారు.

అడవిని తలపిస్తున్న ఐటీఐ ప్రాంగణం

- చెరువులా పల్లపు ప్రాంతం
- మురుగుతో దుర్గంధం



ఐటీఐ స్థలంలో పెరిగిపోతున్న ముళ్ల చెట్లు



జాతీయ చిహ్నం చుట్టూ అపరిశుభ్ర వాతావరణం

తెనాలి అర్బన్, జూన్13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జగ్గడిగుంటపాలెంలో ఉన్న ప్రభుత్వ ఐటీఐ స్థలంలో ముళ్ల చెట్లు పెరిగిపోయి అడవిని తలపిస్తున్నాయి. పల్లపు ప్రాంతంలో నీరు చేరి చెరువులా మారింది. జాతీయ చిహ్నం చుట్టూ అపరిశుభ్రత పెరిగిపోయింది. 20 ఎకరాల్లోని ఐటీఐలో.. ఐదు ఎకరాల భూమిని కేంద్రీయ విద్యాలయం కోసం ఇచ్చారు. మిగిలిన 15 ఎకరాల్లో కొంత మేర కళాశాల భవనాలు ఉండగా.. మిగిలిన ప్రాంతమంతా పిచ్చి చెట్లు, ముళ్ల పొదలతో నిండిపోయింది. దీంతో విష సర్పాల బెడద ఎక్కువైపోయింది. జగ్గడిగుంటపాలెం రోడ్డు వైపు ఉన్న స్థలం పల్లం కావడంతో వర్షపు నీరు చేరుతోంది. దీనికి తోడు పంచాయతీ కాల్వలు సరిగా నిర్వహించకపోవడంతో మురుగు నీరు ఇక్కడ చేరుతోంది. దీంతో దుర్గంధం, దోమల బెడద అధికమైందని స్థానికులు వాపోతున్నారు. ఆవరణలో ఏర్పాటు చేసిన జాతీయ చిహ్నం చుట్టూ చెత్తా చెదారం పేరుకుపోయింది. ఐటీఐలో అటెండర్లు, వాచ్‌మెన్‌లు లేకపోవడంతో విద్యార్థులతోనే కొంత మేరకు శ్రమదానం చేయించి శిక్షణ కేంద్రం నిర్వహణ ప్రాంతం వరకు శుభ్రంగా ఉంచుతున్నారు. దాతలు, ప్రభుత్వం స్పందించి ఐటీఐ ప్రాంగణాన్ని శుభ్రం చేసి, మొక్కలు నాటి నిర్వహణకు తగిన సిబ్బందిని కేటాయించాలని పలువురు సూచిస్తున్నారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

తుళ్లూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మహిళలకు ఉపాధి అవకాశ మార్గాలు అనేకం వస్తుంటాయని వాటిని అందిపుచ్చుకోవాలని సీఆర్డీఏ సోషల్ వెల్ఫేర్ డీడీ బొర్రా శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం తుళ్లూరు ఐనవోలు కాలనీలో డ్వాక్రా వీవోఏల సమావేశం నిర్వహించారు. సీఆర్డీఏ తరపున ప్రతినెలా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు డ్వాక్రా సంఘసభ్యులకు తెలిపారు. ఈ నెల 18న తుళ్లూరు సీఆర్డీఏ కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఆర్డీఏ నుండి ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఇస్తున్న వివిధ కోర్సులలో నైపుణ్య శిక్షణను అందిపుచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు సీసీ మాధవి, స్కిల్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ వెంకట్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పేదలు, సీనియర్ సిటిజన్‌లకు త్వరలో ఉచిత వైద్య సేవలు

● పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివానీ



వట్టిచెరుకూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన పథకం (పీఎంజేఏవై) లబ్ధిదారులకు రూ.5లక్షల వరకు నగదు రహిత వైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయని వట్టిచెరుకూరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివానీ శుక్రవారం వెల్లడించారు. ఈ పథకం ద్వారా నిరుపేదలు, సీనియర్ సిటిజన్‌లకు వైద్యసేవలు ఉచితంగా ప్రభుత్వ, కార్పొరేట్ హాస్పటల్స్ ద్వారా పొందేందుకు వీలుందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న క్యాంపుల ద్వారా కార్డులు అందజేయనున్నట్టు ఆమె వివరించారు. వట్టిచెరుకూరు పీహెచ్‌సీ పరిధిలోని వట్టిచెరుకూరు, లేమల్లెపాడు, అనంతవరప్పాడు, సోపాడు, పల్లపాడు గ్రామాలకు సంబంధించి 2,411మంది లబ్ధిదారులకు కార్డులు అందజేయాలని నిర్దేశించామని, ఇప్పటివరకు 1300మంది చేర్పడం జరిగిందన్నారు. శుక్రవారం లేమల్లెపాడు గ్రామంలో నిర్వహించిన క్యాంపులో ఐదుగురు ఏఎన్ఎంలు, స్థానిక ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారని తెలిపారు. లేమల్లెపాడు క్యాంపులో 110మందికి కార్డులు అందజేశామన్నారు.

ఏవోగా సుబ్రహ్మణ్యం

పెదనందిపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండల వ్యవసాయ అధికారిగా ఐ సుబ్రహ్మణ్యం శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏవో సుధారాణి గుంటూరు ల్యాబ్‌కు బదిలీపై వెళ్లారు.

అమరావతిపై రాక్షస క్రీడ: కొల్లా

కాకుమాను, జూన్ 13(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ మీడియాను అడ్డుపెట్టుకుని అమరావతిపై విషం చిమ్మే రాక్షసక్రీడకు తెరలేపారని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్య చౌదరి శుక్రవారం ధ్వజమెత్తారు. టీడీపీ, చంద్రబాబుపై తీవ్ర వ్యతిరేక భావం ఉన్నందునే సాక్షి చానల్ తనకు గుర్తింపు ఇచ్చిందని కృష్ణంరాజు పోలీసుల విచారణలో అంగీకరించడం వైసీపీ పాపాల పుట్టను బట్టబయలు చేసిందన్నారు. చంద్రబాబు, టీడీపీపై పగ తీర్చుకునే కక్షతోనే సాక్షి టీవీలో రాజధానిపై వికృత ప్రచారం సాగించారని ఆరోపించారు. సాక్షి యజమాని వైఎస్ భారతిపై కూడా చర్యలు తీసుకుని రాజధాని మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

చల్లావారిపాలెం(మేడికొండూరు), జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందజేసిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను గుంటూరు రూరల్ మండల కూటమి నాయకులు గుంటూరు మండలం, చల్లావారిపాలెంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు సూరిశెట్టి హరీష్, సూదా పిచ్చయ్య, తిమ్మిశెట్టి శంకర్రావు, పటేళ్ల నాగభూషణం, వి.జగదీశ్ పాల్గొన్నారు.

మృతులకు నివాళి

కాకుమాను, జూన్ 13(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి ఎంఎస్‌పీ నాయకులు తోడేటి ఏసుపాదం మాదిక శుక్రవారం నివాళులర్పించారు. మృతులకు మండలంలోని బీకే పాలెంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు అంకయ్య మాదిగ, కొండేపాటి సుజాత, సుధాకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ హెనప్రియ

సమస్యలను పరిష్కరించండి

పెదనందిపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రజల దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ హెనప్రియ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని, పీజీఆర్ఎస్‌లో వచ్చే దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సోమవారం జరిగే ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. కార్యక్రమంలో డీటీ షేక్ కరిముల్లా, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేయాలి

పెదనందిపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, కార్యదర్శి, ఆయుష్మాన్ భారత్ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 21న యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందన్నారు. శనివారం అన్ని గ్రామాల్లో యోగా మాక్ డ్రిల్ నిర్వహించాలని తెలిపారు.

విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ

ప్రత్తిపాడు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం షేక్ ఆలీషా, విద్యాకమిటీ చైర్మన్ షేక్ రవూఫ్, జీడీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ భాగ్యారావు, కాకాని సురేష్, కాసు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్టూడెంట్ కిట్స్‌ను అందజేస్తున్న గింజుపల్లి శివరామప్రసాద్

రహదారి మురుగుమయం



మురుగునీరు, బురదతో అధ్వానంగా ఉన్న రహదారి

తాడేపల్లి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని మహానాడు రోడ్ సమీపంలో బర్మా సీతారామయ్య కాలనీలో రహదారి అధ్వానంగా ఉండడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. మట్టి రోడ్డు గుంతలు, మురుగు, బురదతో నిండిపోయి వర్షం వస్తే రహదారి మొత్తం నీటితో నిండిపోయింది. అధికారులకు విజ్ఞప్తి చేసినా స్పందన శూన్యమని రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరారు.

గ్రామ కంఠాల సమస్యలు పరిష్కారం

తుళ్లూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): రాజధాని పరిధిలోని గ్రామ కంఠాల, అసైన్డ్ భూముల సమస్యలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పరిష్కారిస్తామని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. శుక్రవారం తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో గ్రీవెన్స్ డేలో రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 20 సమస్యలపై ఫిర్యాదు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జయశ్రీ, డీసీలు శేషరెడ్డి రవీంద్ర, చిన్నికృష్ణ, పద్మావతి, స్వర్ణమేరి, శ్రీనివాసనాయక్, భాగ్యరేఖ, సోషల్ వెల్ఫేర్ డీడీ బొర్రా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



రైతుల నుంచి అర్జీలు తీసుకుంటున్న డీసీలు

ఎన్నికల హామీలను నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత రామారావు

మంగళగిరి సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాశం రామారావు డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేసిన హామీల కంటే నెరవేర్చని హామీలే ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. మంగళగిరిలో అనేక సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో 22వేల మంది పేదలు వివిధ రకాల భూముల్లో నివాసం ఉంటున్న వారికి ఇళ్లపట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేవలం 3వేల మందికి మాత్రమే ఇళ్ల పట్టాలు ఇచ్చారని, మిగిలినవారికి ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. పట్టణ కార్యదర్శి వీసం జవహర్‌లాల్ మాట్లాడుతూ పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం వెంటనే చేపట్టాలన్నారు. టిడ్కో ముంపు సమస్యకు పరిష్కారం చూపాలన్నారు. ఎంటీఎంసీని రద్దు చేసి మంగళగిరి, తాడేపల్లి మున్సిపాలిటీలుగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నేతలు ఎస్ఎస్ చెంగయ్య, వై.కమలాకర్, ఎం.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మాకూ పరిహారం ఇప్పించండి

● దుగ్గిరాల పసుపు వ్యాపారుల వినతి

దుగ్గిరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన తమకు కూడా పరిహారం ఇప్పించాలని దుగ్గిరాల పసుపువ్యాపారులు తెనాలి ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు. 2024 జనవరి 19న దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీలో జరిగిన అగ్నిప్రమాదంలో కోట్లాది రూపాయల పసుపు పంట దగ్ధమైపోయిందని, ప్రమాదంలో నష్టపోయిన వారికి క్వింటాకు రూ.7 వేల చొప్పున పరిహారం చెల్లిస్తామని ఒప్పందం చేసి ఉన్నారని తెలిపారు. అయితే తమకు కూడా రైతులతోపాటే, ఒప్పందం చేసుకున్న ప్రకారం నగదు అందించాలని వ్యాపారులు కోరారు.



తెనాలి ఆర్డీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందిస్తున్న దుగ్గిరాల పసుపు వర్తకులు



మాట్లాడుతున్న దానబోయిన సుందరరావుయాదవ్

సంక్షేమ పథకాలకు ప్రభుత్వం పెద్దపీట

తాడేపల్లి టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ఐదేళ్లలో చేయని అభివృద్ధి పనులను సంవత్సరంలో కూటమి ప్రభుత్వం చేసి చూపించిందని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావు యాదవ్ తెలిపారు. శుక్రవారం తాడేపల్లిలోని టీడీపీ నేత మాజీ కౌన్సిలర్ కేళి వెంకటేశ్వరరావు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సుందరరావుయాదవ్ మాట్లాడుతూ అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కేళి వెంకటేశ్వరరావు, చింకా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ హక్కులపై అవగాహన

మంగళగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో వృద్ధులకు సీనియర్ సిటిజన్స్ హక్కులపై అవగాహన కల్పించారు. ఆస్తి హక్కులు పొందిన బిడ్డలు తల్లిదండ్రులను రోడ్లపై వదిలివేయడం చూస్తున్నామని, ఈ ఘటనలు ఎంతో బాధాకరమన్నారు. అలాంటి పరిస్థితుల్లో వృద్ధాశ్రమాలు కొండంత భరోసా ఇస్తున్నాయని చెప్పారు. అలా ఎవరైనా తల్లిదండ్రుల ఆస్తిపాస్తులను తీసుకుని వారిని అనాథలుగా వదిలివేస్తే వారి ఆస్తులను మళ్లీ తల్లిదండ్రులకు రాసే చట్టాలను గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్లు దయ్యాల నరసయ్య, మల్లవరపు సందీప్, షేక్ రహీమ్, మల్లవరపు రామమూర్తి, ఆశ్రమ మేనేజ్ శంకర్ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాల్లో అక్షరాభ్యాసం

దుగ్గిరాల: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరిన పిల్లలకు అక్షరాభ్యాసం కార్యక్రమం గురువారం నిర్వహించారు. పేరుకలపూడి శివాలయంలో జరిగిన అక్షరాభ్యాస కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ భవాని, ఎంపీటీసీ తాళ్ల అశోక్, సర్పంచ్ గంగాధర్, గోగం నాగేశ్వరరావు, మైలా వెంకటసుబ్బారావు, యలవర్తి కోటేశ్వరరావు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



కృత్రిమ కాళ్లను అమర్చుకున్న దివ్యాంగులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల అమరిక

మంగళగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి, రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న శ్రీపాదం ప్రాజెక్టులో భాగంగా దివ్యాంగులకు ప్రభా ఫుట్ కృత్రిమ కాళ్లను పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 127 మంది దివ్యాంగులకు మంగళగిరి వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం కాలి కొలతల ఆధారంగా కృత్రిమ కాళ్లను రూపొందించి అమర్చారు. గుజరాత్‌లోని భావ్‌నగర్ నుంచి విచ్చేసిన నిపుణుల బృందం లబ్ధిదారులకు కృత్రిమ కాళ్లను ప్రత్యేకంగా రూపొందించింది. పంపిణీ కార్యక్రమాన్ని రోటరీ జిల్లా 3150 గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ రాంప్రసాద్ ప్రారంభించారు. రూ.24 లక్షల వ్యయంతో నిర్వహిస్తున్న ఈ ప్రాజెక్టుకు బీజీఆర్ మైనింగ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ సంస్థ రూ.12 లక్షలను విరాళంగా అందజేసిందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు చైర్మన్ అనిల్ చక్రవర్తి, రోటరీ క్లబ్ జూబ్లీ హిల్స్ అధ్యక్షుడు విసిరెడ్డి బాలకోటిరెడ్డి, పీడీజీ రవి వడ్లమాని, పీడీజీ అన్నే రత్నప్రభాకర్, మంగళగిరి ప్రధాన కార్యదర్శి అందె మురళీమోహన్‌రావు, ప్రగడ రాజశేఖర్, పారేపల్లి నిరంజన్ గుప్తా, గోలి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి..

తాడేపల్లి(పెనుమాక), జూన్ 13(ఆంధ్రజ్యోతి): నాలుగు దశాబ్దాలుగా పెనుమాక, పరిసర ప్రాంత విద్యార్థులకు ఉత్తమ విద్య అందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ప్రిన్సిపల్ మద్దుకూరి శ్రీనివాసరావు కోరారు. వార్షిక ఫీజు ఎంపీసీ, బైపీసీకి కేవలం రూ.2408 అని, సీఈసీ, హెచ్ఈసీకి రూ.1418గా తెలిపారు. తల్లికి వందనం పథకం అందుతుందన్నారు. విట్ అందించే ఉచిత ఇంజనీరింగ్ కోర్సుకు తమ కళాశాల విద్యార్థి ఎంపికయ్యాడన్నారు.



రైతుల సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్డీఏ అధికారులు

సీఆర్డీఏ కార్యాలయంలో రైతులతో సమావేశం

తుళ్లూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): తుళ్లూరు సీఆర్డీఏ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం సీఆర్డీఏ డెవలప్‌మెంట్ ప్రమోషన్ అధికారి సునీత ఆధ్వర్యంలో రైతులకు సమావేశం నిర్వహించారు. రాజధానిలో పేద, మధ్య తరగతి ప్రజలకు నివాసాలుండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే బాగుటుందని ప్రపంచబ్యాంకు ఇటీవల సూచన చేసింది. దీంతో రైతులతో సమావేశం నిర్వహిలచారు. భారీ ప్లాట్లలో అపార్ట్‌మెంట్‌లు కట్టే రైతులు అందులో పదిశాతం ఇళ్లను ప్రభుత్వానికి రాయితీ మీద ఇచ్చే అంశంపై అవగాహన కల్పించారు. ఇలాచేస్తే ప్రభుత్వం పేదలకు నివాసాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవచ్చని రైతులకు సూచించారు. ఎకరం భూమి ఇచ్చి 25సెంట్లు తీసుకున్నామని, ఇంకా త్యాగాలు చేయమంటే ఎలాగని రైతులు ప్రశ్నించారు. ముందు ప్లాట్లను అభివృద్ధి చేయకుండా ఈ అంశం తెరమీదకు తీసుకురావటం మంచిది కాదని అధికారులకు రైతులు సూచించారు. కార్యక్రమంలో రైతు నేతలు, గ్రూపు డైరెక్టర్ కృష్ణమోహన్ పాల్గొన్నారు.

తల్లికివందనం మంజూరుపై హర్షం

దుగ్గిరాల, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ చదివే మొత్తం 6571 మంది విద్యార్థులకు రూ.9 కోట్ల 85 లక్షల 65 వేలు మంజూరైనట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. చింతలపూడిలో 179 మందికి తల్లికివందనం నగదు మంజూరైంది. లబ్ధి పొందిన తల్లులు, పిల్లలు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ల ఫోటోలకు పాలాభిషేకం చేశారు. సర్పంచ్ తాడిబోయిన రామకృష్ణ, పట్టెల శ్రీనివాసరావు, కోలా రమణ, కార్యదర్శి మణికంఠ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ


మేడికొండూరు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను శుక్రవారం టీడీపీ మండల నాయకులు అందజేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పాములపాటి శ్రీనివాస్ మాట్లాడుతూ సుపరిపాలన అంటే ఏమిటో కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పేరేచర్ల సర్పంచ్ దేవరకొండ రాజ్‌కుమార్, వార్డు సభ్యులు పాములు పట్టి సురేష్, మన్నె శ్రీనివాసరావు పాల్గొన్నారు.



దుగ్గిరాల ఆలీనగర్‌కు చెందిన పఠాన్ జున్నూఖాన్ కుమార్తె నిజ్మ, షేక్ నిస్సర్‌సమీలకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లికానుకను స్థానిక నాయకులు అందజేశారు. టీఎన్‌టీయూ అధ్యక్షుడు వల్లూరు నరసింహారావు, నక్కా చిరంజీవి, పర్వతనేని హర్ష, పసుపులేటి రవి యాదవ్, పాటిబండ్ల సాయి, బొజ్జా బాలు, రియాజ్ పాల్గొన్నారు. - దుగ్గిరాల

దుగ్గిరాల యార్డులో పసుపు ధరలు

దుగ్గిరాల, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక పసుపు మార్కెట్ యార్డులో శుక్రవారం జరిగిన వేలంలో 867 బస్తాల పసుపు విక్రయాలు జరిగాయి. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,700, గరిష్ఠ ధర రూ.10,250, మోడల్ ధర రూ.10,225 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.9,750, గరిష్ఠ ధర రూ.10,250 మోడల్ ధర రూ.10,225 పలికాయి.



మాట్లాడుతున్న జిల్లా నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ కుమార్

ఫ్లోరోసిస్‌పై అవగాహనతో వ్యాధి దూరం

ఫిరంగిపురం, జూన్ 13(ఆంధ్రజ్యోతి): ఫ్లోరోసిస్ వ్యాధిపై అవగాహనతో నివారణ సాధ్యమని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణ అధికారి డాక్టర్ గిరిధర్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బేతపూడి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కొండపల్లి సుదర్శనరాజు, సీహెచ్‌వో టీ శిరీష, ఏఎన్ఎం ఆరోగ్య మాధురి పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్య ప్రయోజనాలు

మంగళగిరి, జూన్ 13(ఆంధ్రజ్యోతి): నిత్యం యోగ సాధన ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు సిద్ధిస్తాయని యోగ శిక్షకులు తెలిపారు. వేంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో మంగళగిరి మండలం పెదవడ్లపూడిలోని నాగార్జున హైస్కూల్‌లో ప్రత్యేక యోగ శిక్షణా శిబిరంలో ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం గురించి శిక్షణ ఇస్తున్నట్లు మొక్కపాటి లక్ష్మీనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ రాఘవయ్య, మాధవి, జవ్వాది శ్రీను, రాజేశ్వరి, దుర్గారావు, వాణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఏకాదశ రుద్ర పారాయణం

మంగళగిరి సిటీ: శ్రీసత్య సాయిబాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం మంగళగిరి శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వశాంతి కోసం ఏకాదశ రుద్రపారాయణం నిర్వహిస్తున్నట్లు శ్రీసత్యసాయి సే వాసంస్థల వేదాధ్యయన బృందం ప్రతినిధులు తెలిపారు.

కులం పేరుతో దూషించారని ఫిర్యాదు

మంగళగిరి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తమను కులం పేరుతో దూషించారంటూ మంగళగిరి కుప్పురావు కాలనీ 11వ లైనులో నివాసం ఉంటున్న పగడపోగు రాధ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ ఎదురింట్లో నివాసం ఉంటున్న మునాల ప్రీతి అనే మహిళ ప్రతిరోజు అకారణంగా తమను కులం పేరుతో తిడుతూ బహిరంగంగా దూషిస్తుందన్నారు. తాము నడిచి వెళ్లిన దారిలో పసుపు నీళ్లు చల్లుతూ మైల పోయిందంటూ అపహాస్యం చేస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితురాలిపై కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని దళిత సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు.

నేడు మండలంలో విద్యుత్ నిలిపివేత

పెదనందిపాడు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరగాని, పెదనందిపాడు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ కరుణాకర్ శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం ఉదయం 9నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

● వట్టిచెరుకూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మరమ్మతుల నిమిత్తం ముట్లూరు, కారంపూడిపాడు, కాట్రపాడు, పల్లపాడు, గారపాడు, సోపాడు, చమళ్ళమూడి, యామర్రు గ్రామాల్లో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రవితేజ తెలిపారు.

● తుళ్లూరు(మందడం), జూన్ 13(ఆంధ్రజ్యోతి): మరమ్మతుల సందర్భంగా రెండో శనివారం మందడం సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రకటనలో పేర్కొన్నారు. మందడం, వెంకటపాలెం, తాళ్లాయపాలెం, వెలగపూడి, మల్కాపురం, ఐనవోలు, లింగాయపాలెం, మోదులింగాయపాలెం, ఉద్దండ్రాయునిపాలెంలో సరఫరా ఉండదన్నారు.

● మేడికొండూరు, జూన్ 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని డోకిపర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పుల్లారెడ్డి శుక్రవారం చెప్పారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంట వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

పెదవడ్లపూడిలో ఎల్‌వోసీ చెక్కు అందజేత



యువకుడి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న కిరణ్‌చంద్, టీడీపీ నేతలు

మంగళగిరి సిటీ, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పెదవడ్లపూడి గ్రామానికి చెందిన షేక్ బాషా అనే యువకుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంత్రి నారా లోకేశ్ రూ.2.07 లక్షల ఎల్‌వోసీ చెక్కును మంజూరు చేయించారు. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాషా ఆరోగ్య పరిస్థితిని స్థానిక నేతలు మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సీఎంఆర్ఎఫ్ ద్వారా నిధులను మంజూరు చేయించారు. చెక్కును మంగళగిరి మార్కెట్ యార్డు చైర్మన్ జవ్వాది కిరణ్‌చంద్, స్థానిక నేతలు శుక్రవారం బాషా కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు యేళ్ల శివరామయ్య, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు, షేక్ అమీర్ బేగ్, ఏసు, నాగమణి, బొర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

టీడీపీ కార్యాలయంలో గ్రీవెన్స్

తెనాలి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నియోజవర్గంలోని ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేలా గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు నిర్వహించారు. పలు ప్రాంతల నుంచి రేషన్ కార్డు, పింఛన్, నివేశన స్థలాలు వంటి పలు సమస్యలతో అర్జీలు అందించారు. కార్యాలయంలో అందించిన ప్రతి అర్జీని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందని నాయకులు హామీ ఇచ్చారు. మహమ్మద్ ఖుద్దూస్, కౌన్సిలర్ దివి అనిత, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, తవ్వా ప్రసాద్, బీవీ చౌదరి, మల్లవరపు విజయ్‌కుమార్ పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నేడు స్పెషల్ యోగా మాసోత్సవాలు

తెనాలి, మారీసుపేట,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): నేడు శుక్రవారం స్పెషల్ యోగా మాసోత్సవాలను పట్టణంలో నిర్వహించనున్నామని అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు ఈ నెల 21న జరగనున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ వారి ఉత్తర్వుల మేరకు యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలో 472 సెంటర్లు (39 లొకేషన్స్)లో స్పెషల్ యోగా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేట్ స్కూల్స్ ఓపెన్ గ్రౌండ్స్, కాలేజీలు, సచివాలయాలు, కమ్యూనిటీ హాల్స్, కల్యాణ మండపాలలో ఉదయం 7గంటల నుంచి 9 గంటల వరుకు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తామని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలి అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రెండో శనివారం పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని ఏడీఈ బి.అశోక్‌కుమార్ తెలిపారు. తెనాలి, రూరల్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తామన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణ, మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈఈ ఏ వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): వృద్ధాశ్రమంలో వృద్ధులకు శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మా గాంధీ శాంతి వృద్ధాశ్రమంలో ఎస్‌వీ యోగా సభ్యుడు పాలడుగు వెంకటేశ్వరావు వర్ధంతి సందర్భంగా భార్య సుమతి, కుటుంబ సభ్యుల సహకారంతో ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీచేసి అన్నదానం చేశారు. ముందుగా ఆయన చిత్రపటానికి సంఘ సభ్యులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పట్టణంలో పలు వృద్ధాశ్రమాలలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ యోగా సభ్యులు ముద్దాభక్తుని రమణయ్య, తన్నీరు శివశంకర్, కుర్రా శ్రీను, ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, మురళి, భారతి, సత్యనారాయణ, సుమతి పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

రేపు శాస్త్రీయ సంగీత సభ

తెనాలి అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బోసురోడ్డులోని శ్రీవాసవీ ఆలయంలో ఆదివారం శాస్త్రీయ సంగీత సభ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. హేమాద్రి మ్యూజికల్ అకాడమీ ఆధ్వర్యంలో గానవిదూషి గద్దె వెంకటరామకుమారి దశమ వర్ధంతి సంగీత ఉత్సవంలో నాదసుధార్ణవ అన్నవరపు రామస్వామి, విశ్రాంత జడ్జి ప్రభాకర్ పాల్గొంటారని తెలిపారు.

బీసీ హాస్టళ్ల సమస్యలు పరిష్కరించాలి: కేసన

తెనాలి అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): బీసీ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. వసతి గృహాల్లో విద్యార్థులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం పంపామన్నారు. కాస్మోటిక్ డైట్ చార్జీలు, మార్కెట్ ధరలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయని, పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వసతి గృహాలు, అద్దె ఇళ్లలో నడుస్తూ అసౌకర్యాలతో కునారిల్లుతున్నాయని తగిన వసతలు కల్పించాలన్నారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు హాస్టల్స్‌పై దృష్టి సారించాలని, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విదేశీ విద్య సాయం అందించాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

● ఎస్ఐ నాగరాజు

తెనాలి, మారీసుపేట,జూన్ 13 (ఆంధ్రజ్యోతి): యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని టూటౌన్ ఎస్ఐ పి.నాగరాజు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక శివాజీచౌక్‌లో టూ టౌన్ ఎస్ఐ పి.నాగరాజు తన సిబ్బందితో కలసి వాహన తనిఖీలు చేపట్టారు. ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న పలు వాహనాలను ఆపి కేసులు నమోదు చేశారు. పాత చలానాలు చెల్లించని, సరైన పత్రాలు లేని వాహనాలకు చలానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనర్లు వాహనాలు నడుపరాదని, యువత అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడవద్దని, వ్యసనాలకు బానిసలు కావద్దని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కదలని మురుగు

● వ్యర్థాలతో నిండిన కాల్వలు
● దుర్గంధంతో స్థానికులకు ఇబ్బందులు
● దోమల ఆవాసాలుగా మారి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం



బుర్రిపాలెం రోడ్డులో పిచ్చిమొక్కలు, వ్యర్థాలతో నిండి ఉన్న కాలువ

తెనాలి, మారీసుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మురుగునీరు ప్రవహించాల్సిన కాలువలు వ్యర్థాలతో నిండి అధ్వానంగా తయారయ్యాయి. కాలువల వెంట స్థానికంగా నివసించే ప్రజలు దుర్గంధంతో అల్లాడిపోతున్నారు. ప్రతిరోజు శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టితో పనులు చేపడుతున్నామని మున్సిపల్ యంత్రాంగం చెప్పడం మినహా ఆచరణలో ఎక్కడా దాఖలా లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పురపాలక సంఘ పరిధిలో 40వ వార్డులో నిర్వహణ లోపంతో రోజుల తరబడి కాలువలలో నీరు నిలిచి తెట్టలు కట్టి దోమలకు ఆవాసాలుగా మారటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీ లక్షల రూపాయలు కాలువల నిర్వహణకు వెచ్చిస్తుండగా అవి పూర్తిస్థాయిలో సత్ఫలితాలు ఇవ్వకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే అన్న చందంగా మారాయి. శానిటేషన్ అధికారులు దోమల నియంత్రణకు ఆయిల్ బాల్స్ వేయడం, గంబూషియా చేపలు, ఫాగింగ్ వంటివి చేపట్టాల్సి ఉంటుంది. అయితే డ్రైడే ఫ్రైడే అంటూ బ్యానర్లు ప్రదర్శిస్తూ అవగాహన కార్యక్రమాలు మినహా నివారణకు ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉదయం పూట అడపాదడపా పారిశుధ్య కార్మికులు కాలువల వైపు చూసి వెళ్తున్నారే తప్ప మురుగు పేరుకొనిపోయిన వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించేందుకు చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా ఎక్కడి మురుగు అక్కడే ఉంటోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండలు విపరీతంగా ఉండే సమయంలోనే దోమలు వృద్ధి చెందుతూ కంటి మీద కునుకు లేకుండా చేస్తుంటే రానున్న వర్షాకాలం పరిస్థితి మరింత భయానకంగా మారుతుందని పలువురు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులను చేపట్టి మురుగు కాలువలలో నీరు నిలువకుండా పారుదల చూడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



మారీసుపేట, మఠంబజారులో కాలువలో తెట్టలు కట్టిన మురుగు

విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా విద్యాబోధన చేయాలి

కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పార్వతి



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పార్వతి తదితరులు

పొన్నూరు టౌన్, చేబ్రోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా విద్యాబోధన చేయాలని కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ పార్వతి అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, పాఠశాలలో సౌకర్యాలు, ఉపాధ్యాయుల పనితీరు గురించి వాకబుచేశారు. నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ సాధించిన విద్యార్థులు హారిక, అవినాష్, రవి శంకర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ బేస్‌లైన్ టెస్టులు నిర్వహించి విద్యా ప్రమాణాల ఆధారంగా బోధన చేయాలని సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణ మిత్ర కిట్‌లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు, సమగ్ర శిక్ష అధికారులు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

నూతన భవనాన్ని నిర్మించరూ...

● రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్‌కు సంగం జాగర్లమూడి వాసుల వినతి

తెనాలి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న సంగంజాగర్లమూడి శాఖా గ్రంథాలయానికి నూతన భవనాన్ని నిర్మించాలని సంగంజాగర్లమూడి గ్రామ పెద్దలు కొత్త రమేష్‌బాబు, గ్రామ సర్పంచ్ భర్త పాలడుగు రవీంద్రలు కోరారు. గ్రంథాలయ పరిషత్ చైర్మన్ కోటేశ్వరరావును గుంటూరులోని కార్యాలయంలో శుక్రవారం గ్రామ పెద్దలు ఆయనను కలిసి గ్రామంలోని గ్రంథాలయ భవన దుస్థితిని వివరించి వినతి పత్రం అందించారు. బ్రిటీష్‌కాలం నాటి పెంకుటిళ్లు కావడంతో పైకప్పు నుంచి వర్షపు నీరు లోపలకు కారుతోందన్నారు. ప్రధాన రోడ్డు ఎత్తుగా ఉండటంతో వర్షాకాలం గ్రంథాలయం నుంచి వర్షపు నీరు బయటకు వెళ్లే వీలు కూడా లేకుండా ఉందన్నారు. ప్రభుత్వ సహకారం అందిస్తే గ్రామస్థులు కొంత మొత్తంలో నిధులు వెచ్చించి గ్రంథాలయ సేవలను భావితరాలకు అందేలా చూస్తామన్నారు. మంత్రి నారా లోకేశ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లి త్వరితగతిని నూతన భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా గోనుగుంట్ల హామీ ఇచ్చారు. వీరితోపాటు గ్రంథాలయ జిల్లా అధికారి వంకదారి సుబ్బరత్నమ్మ, పలువురు కార్యాలయ సిబ్బంది ఉన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రియదర్శిని విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రియదర్శిని డిగ్రీ కళాశాల విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఉద్యోగాలు లభించాయి. కళాశాల అధ్యక్షుడు బొల్లిముంత అమరేశ్వరరావు అధ్యక్షతన శుక్రవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. టీసీఎస్ ఐటీ కంపెనీకి ఏడుగురు, టీసీఎస్, బీపీఎస్ కంపెనీకి 13 మంది, ఇన్ఫోసిస్ కంపెనీకి ఒకరు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన ప్రణాళికను అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బొల్లిముంత శివరామకృష్ణ, శ్రీసుధ, వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.

ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలి

● డీఆర్‌డీఏ ఐబీ డీపీఎం కామేశ్వరి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఐబీ డీపీఎం కామేశ్వరి

కొల్లిపర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని డీఆర్‌డీఏ ఐబీ డీపీఎం బి.కామేశ్వరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కొల్లిపరలో పొదుపు సంఘాల సభ్యులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. మొబైల్ బుక్ కీపింగ్ ద్వారా సమావేశాల నిర్వహణ గురించి, ఆన్‌లైన్ లావాదేవీలపై పొదుపు సంఘాల సభ్యులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కామేశ్వరి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు పొదుపు ఎక్కువ చేసుకుంటే ఎక్కువ రుణాలు పొందటానికి వీలుకలుగుతుందన్నారు. మండలంలో 690 డ్వాక్రా గ్రూపులకు రూ.45కోట్ల వరకు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు స్త్రీనిధిలో కూడా పొదుపు చేసుకోవాలన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే బ్యాంకు రుణాలను వినియోగించాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి, సీసీలు మధు, పూర్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: ఎంఈవో

పొన్నూరుటౌన్, చేబ్రోలు, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంఈవో రాయల సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పది పరీక్షలలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన సభ శుక్రవారం జరిగింది. విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, విద్యా సామగ్రి, చుండూరు భాస్కరరావు, అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామస్థులు పూర్వ విద్యార్థి సంఘం నాయకులు ఘనంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాడు ఎం.ఏడుకొండలు, విద్యాకమిటీ చైర్మన్ నాగమల్లేశ్వరరావు, వెలగా పవన్, పసుపులేటి గణేష్, వెంకటేశ్వరరావు, సీహెచ్ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.25వేల విలువైన బెంచీల వితరణ

పొన్నూరు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నేతాజీ నగర్ మున్సిపల్ హైస్కూల్‌కు శుక్రవారం స్వర్ణపురి సేవా సంఘం ఆధ్వర్యంలో రూ25 వేలు విలువ కలిగిన బెంచీలను అందజేశారు. కార్యక్రమంలో సేవా సంఘం నిర్వాహకులు ఉపాధ్యాయులు, స్థానికులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మురుగునీరు, వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉన్నఆలయ ప్రాంగణం

అపరిశుభ్రంగా ఆలయ ప్రాంగణం

తెనాలి, మారీసుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక గంగానమ్మపేటలోని పర్వతవర్ధనీ సమేత రామేశ్వర స్వామివారి దేవాలయం (పాత శివాలయం) ప్రాంగణంలో అపరిశుభ్ర వాతావరణం చోటుచేసుకుంది. నిత్యం వందలాది మంది భక్తులు వచ్చి స్వామివారు అమ్మవార్లను దర్శించుకుంటుంటారు. ఆదే దేవాలయ ప్రాంగణంలోని దేవతా వృక్షం (రావిచెట్టు, వేపచెట్టు కలసి) ఉన్న ప్రాంతంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొని ఉంది. మురుగునీరు నిలిచి, వ్యర్థాలతో అక్కడ దుర్గంధం వెదజల్లుతోంది. అధికారులు దేవాలయ పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పలువురు భక్తుల కోరుతున్నారు.

కోచ్ నిరంజన్‌కు సత్కారం



కోచ్ నిరంజన్‌ను సన్మానిస్తున్న టీడీపీ పట్టణ, మండలాధ్యక్షుడు హరిప్రసాద్, కోటేశ్వరావు తదితరులు

తెనాలి, మారీసుపేట, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారీసుపేటలోని సిక్స్ సిగ్మా చెస్ అకాడమీలో గురువారం అకాడమీ డైరెక్టర్, కోచ్ మోచర్ల నిరంజన్‌ను టీడీపీ పట్టణ, మండలాధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరావులు దుశ్శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెస్ అకాడమీ ద్వారా అనేకమంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి జాతీయ అంతర్జాతీయ చెస్ పోటీలలో పాల్గొని అనేక బహుమతులను సాధించేలా తీర్చిదిద్దారన్నారు. ఇటీవల షార్జాలో జరిగిన అంతర్జాతీయ చెస్ పోటీలలో అకాడమీ శిక్షణపొందిన విద్యార్థిని యశశ్విని అంతర్జాతీయ స్థాయిలో 2000 రేటింగ్ సాధించిందన్నారు. ఈ అకాడమీ విద్యార్థులు మరిన్ని పోటీలలో విజయాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో చావలి అకుల్‌నాథ్, చావలి రాజేంద్రప్రసాద్, చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.



వర్షానికి రోడ్డు మార్జిన్‌లో నిలిచిన వాననీరు

పొన్నూరులో భారీ వర్షం

జలమయమైన రహదారులు

పొన్నూరు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో శుక్రవారం భారీ కురిసింది. దీంతో రహదారులన్నీ జలమయమై జనజీవనం అస్తవ్యస్తమైంది. ఉదయం నుంచి తీక్షణమైన ఎండతో తీవ్ర ఇబ్బందులు పడిన ప్రజలు మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా ఆకాశం చల్లబడడంతో ఉపశమనం పొందారు. అయితే అకస్మాత్తుగా భారీవర్షం ఏకధాటిగా గంట పాటు కురవడంతో రహదారులపై, లోతట్టు ప్రాంతాలలో వాననీరు నిలిచి ప్రజా రవాణాకు తీవ్ర అసౌకర్యం కలిగింది. రహదారుల వెంట నిలిపి ఉంచిన వాహనాల్లోకి సైతం వాననీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

జూలై 5న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు టౌన్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): జూలై 5న స్థానిక సివిల్ కోర్టులో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి జీ రుక్మిణి శుక్రవారం తెలిపారు. రాజీ పడతగిన కేసులు, సివిల్, కుటుంబ వివాదాలు, మనోవర్తి, చెక్‌బౌన్స్ కేసులు, ప్రీ లిటిగెంట్ కేసులను అదాలత్‌ను ఆశ్రయించి పరిష్కరించుకోవాలని మెజిస్ట్రేట్ సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ

అర్హుల దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలి

● తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): అర్హులైన వారందరికి తప్పనిసరిగా రేషన్‌కార్డు దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో కొత్తరేషన్‌కార్డులు, పెన్షన్‌లు నమోదుపై సమీక్ష నిర్వహించారు. రేషన్‌కార్డులు, పింఛన్లు, ఆన్‌లైన్ నమోదుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ రేషన్‌కార్డులు, పింఛన్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు తప్పనిసరిగా లబ్ధిదారులు పెట్టుకున్న దరఖాస్తును పరిశీలించాలన్నారు. రేషన్‌కార్డు దరఖాస్తుకు గడువు అనేది లేదని ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజేష్, ఆర్ఐ వంశీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

బాపట్ల రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మహిళా మృతిచెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాపట్ల రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పొన్నూరు పట్టణానికి చెందిన పి.కుమార్‌రాజు, కృపావతి అనే ఇద్దరు ఈ నెల 9వ తేదీన ద్విచక్ర వాహనంపై బాపట్ల మండలం అప్పికట్ల గ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణంలో పొన్నూరుకు వెళుతుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో కృపావతి (35) తలకు తీవ్రగాయం అవ్వటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఆమె మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేయటం జరిగిందని రూరల్ పోలీసులు తెలిపారు.

సంగంజాగర్లమూడి కాలువలో మృతదేహం లభ్యం

తెనాలి రూరల్, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగంజాగర్లమూడి కొమ్మమూరు కాలువలో శుక్రవారం మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి వచ్చిన పోలీసులు మృతదేహాన్ని కాలువ నుంచి వెలికితీశారు. మృతుడు ఉబ్బిపోయి అతడి ఒంటిపై లుంగీ, చొక్కాతో ఉన్నాడు. సుమారు 45 నుంచి 50 మధ్య వయస్సు ఉండవచ్చని భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియరాలేదు.